



కాకినాడలో జాబితా తనిఖీ

అమ్మలకు.. ఆనందం!



చంద్రన్నకు తల్లుల వందనాలు

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ- ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు.. అమ్మల కళ్లల్లో ఆనందం చూశారు. 'తల్లికి వందనం' డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ కావడం శుక్రవారం నుంచి ఆరంభమైంది. గురువారం జమ అవుతాయని చెప్పినా అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం రూపంలో అనుకోని విపత్తు సంభవించడంతో ఒకరోజు ఆలస్యమైంది. చంద్రబాబు చెప్పిన విధంగానే ఎందరు పిల్లలు (విద్యార్థులు) అంతమందికీ ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఒకటో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది అడ్మిషన్లు జరుగుతున్న కారణంగా వారికి తర్వాత ఇస్తారు. ఇప్పుడు రెండో తరగతి నుంచి పది, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు సంబంధించి వారి తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికీ రూ.13 వేలు చొప్పున జమవుతున్నాయి. రూ.2 వేలను పాఠశాల నిర్వహణ నిమిత్తం మినహాయిస్తున్నారు. ఇద్దరు పిల్లలుంటే రూ.26 వేలు.. ముగ్గురు పిల్లలుంటే రూ.39 వేలు ఖాతాల్లో జమ చేశారు. ఆ మెసేజ్‌సెల్‌కి రావడంతోనే కుటుంబం ఎగిరి గంతేసినంత పనిచేస్తోంది.

5.80 లక్షల మంది విద్యార్థులు

ఉమ్మడి తూర్పుగోదావరిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 5.80 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానం కావడంతో ఒకేసారి అంత మొత్తాన్ని ఆయా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తే సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతాయి. సర్వర్లు మొరాయిస్తాయి. అందువల్ల అర్హులైన ప్రతి ఒక్కరి ఖాతాల్లో గంటల తేడాతో సొమ్ము జమవుతోంది. ఈ ప్రక్రియ వచ్చే నెల 5 వరకూ కొనసాగనుంది. తూర్పు గోదావరి జిల్లాలో 1,88,226 మంది విద్యార్థులకు సంబంధించి 1,23,779 మంది తల్లుల ఖాతాల్లో సుమారు రూ.240 కోట్లు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,70869 మంది పిల్లలకు సంబంధించి 1,12,419 మంది తల్లుల ఖాతాల్లో రూ.250 కోట్లు, కాకినాడ జిల్లాలో 2,28,780 మంది విద్యార్థులకు సంబంధించి 1,49,400 మంది తల్లుల ఖాతాల్లో రూ.340 కోట్లు జమ కానున్నాయి.

సచివాలయాల వద్ద క్యూ

సచివాలయాల వద్దకు ప్రజలు పదుల సంఖ్యలో చేరుకుని అర్హత జాబితాలను పరిశీలించుకునే పనిలో బిజీబిజీగా ఉన్నారు. కొందరు అనర్హుల జాబితాలో ఉండడంతో కారణాల అన్వేషణలో పడ్డారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అత్యధికులు విద్యుత్ బిల్లుల షాక్ వల్ల అనర్హుల జాబితాలోకి వెళ్లిపోయారు. ఏడాదిని యావరేజ్ చేసి విద్యుత్ బిల్లులు నిర్ధారించడంతో ఈసారి ఎక్కువ మంది లబ్ధిదారులు అర్హత సాధించకుండాపోయారు. పి.గన్నవరం మండలం లంకలగన్నవరం గ్రామానికి చెందిన 178 మందికి విద్యుత్ బిల్లుల షాక్ కారణంగా అనర్హులుగా పరిగణించబడ్డారు. వీరంతా గన్నవరంలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి వచ్చి ఏడాదిని యావరేజ్ చేయించుకుని విద్యుత్‌శాఖ నుంచి సర్టిఫికెట్లు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరో వైపు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలకు కొందరు చేరుకుని తమ పేరున నాలుగు చక్రాల వాహనాలు ఉండడం వల్ల అనర్హత జాబితాలో ఉన్నామని.. తమకు ఏమీ లేవని క్లియరెన్స్ సర్టిఫికెట్లు కావాలంటూ కార్యాలయాల చుట్టూ తిరగడం ప్రారంభించారు. ఒక చోట మ్యాపింగ్ పూర్తయిన తర్వాత మరో చోటకు ఇల్లు మారిన వారు అయోమయానికి గురవుతన్నారు. తాము ప్రస్తుతం నివాసం ఉంటున్న పరిధిలోని సచివాలయంలో పిల్లల పేర్లు లేకపోవడం, ఎక్కడ జాబితాలో ఉన్నాయో తెలియకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శించారన్న సమాచారం ఇప్పుడిప్పుడే గ్రామాల్లో ప్రజలకు చేరుతుంది. రెండో శనివారం సెలవు, ఆదివారం సెలవు దినాలు కావడంతో లబ్ధిదారులు మళ్లీ సోమవారం వరకు తమ భవిష్యత్తును పరీక్షించుకునేందుకు రెండు రోజులపాటు వేచి చూడాల్సిందే. నిధులు పొందిన వారిలో ఆనందం కనిపిస్తుంటే, అనర్హుల్లో మాత్రం ఆవేదన వ్యక్తమవుతోంది.



తల్లికి వందనం నగదు జమ సందర్భంగా కాకినాడ పెగోడా స్కూల్‌లో సీఎం చిత్రపటానికి పాలభిషేకం

- » మాట నెరవేర్చిన ప్రభుత్వం
- » తల్లుల ఖాతాల్లో నగదు జమ
- » ఉదయం నుంచి ఫోన్లకు మెసేజ్‌లు
- » సచివాలయాల్లో అర్హుల జాబితా
- » ఎగిరి గంతేసిన అర్హులు
- » 20 వరకు అభ్యంతరాల స్వీకరణ
- » 28న మరో జాబితా ప్రదర్శన
- » 30న ఒకటి, ఇంటర్ విద్యార్థులకు

నగదు జమకాకపోయినా కంగారుపడొద్దు!

సచివాలయాల్లో శుక్రవారం నుంచి అర్హులు, అనర్హుల జాబితా ఉంచారు. అభ్యంతరాలు, వినతులు ఈనెల 20వ తేదీలోపుగా ఆయా సచివాలయాల ద్వారా సమర్పించాలి. మరొక అర్హుల జాబితా 28వ తేదీలోపుగా రూపొందిస్తారు. ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు సంబంధించి ఈనెల 30న జాబితాలు ప్రదర్శిస్తారు. మొత్తం తల్లికి వందనం నగదు జమ ప్రక్రియ వచ్చే నెల 5వ తేదీతో పూర్తి చేస్తారు. అర్హుల జాబితాలో ఉంటే సొమ్ము ఖచ్చితంగా జమవుతుందని అధికారులు చెబుతున్నారు. అనర్హత జాబితాలో ఉన్నవారు నిరాశకు గురైనా గ్రీవెన్స్‌కి సమయం ఉందని సూచిస్తున్నారు. ఇప్పుడు ప్రకటించినది మొదటి లిస్టు.. సమస్యల పరిష్కారం తర్వాత రెండో లిస్టు ప్రకటిస్తారని చెబుతున్నారు. ఆధార్ తదితర సమస్యలు ఉంటే సరిచేసుకోవాలంటూ ఇప్పటికే ఆయా పాఠశాలలకు జాబితాలు వెళ్లాయి. దీంతో పాఠశాలల సిబ్బంది తల్లులకు సమాచారం ఇస్తున్నారు. ప్రతి తల్లి లేదా సంరక్షకుడు ఆధార్ సీడింగ్ పూర్తి చేసుకున్న బ్యాంకు ఖాతాకే డబ్బులు జమవుతాయి. సింగిల్ పేరెంట్ తండ్రి ఉంటే అతని ఖాతాకు డబ్బులు వెళతాయి.అనాథ పిల్లల నగదును కలెక్టర్ల ఖాతాల్లో జమ చేసి పరిశీలన అనంతరం అందజేస్తారు. ఇప్పటికే అర్హులకు సంబంధించిన నగదును బ్యాంకులకు ప్రభుత్వం పంపించింది.



నలుగురికి రూ.52 వేలు..

మాది పెరవలి మండలం కానూరు అగ్రహారం.. మా నలుగురు పిల్లలు.. రూ.52 వేలు మా అకౌంట్‌లో పడ్డాయి. ఒకేసారి ఇంత పెద్ద మొత్తం మా అకౌంట్‌లో పడడం తొలిసారి. చాలా ఆనందంగా ఉంది. గతంలో కేవలం ఒక్కరికి మాత్రమే వచ్చేవి. సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు.

- మిండాల శివయ్య, ధనలక్ష్మి, కానూరు



ఆధార్ లింకైతే నలుగురికి...

మాకు నలుగురు పిల్లలు. సాకుర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. గతంలో అమలాపురంలో ఉండేవాళ్లం. రేషన్‌కార్డు అక్కడే ఉంది.బ్యాంకుఖాతాకు ఆధార్ అనుసంధానం కాలేదు.దీంతో నిలిచిపోయింది. అనుసంధానమైతే తల్లికి వందనం వస్తుందని విద్యాశాఖాధికారులు తెలిపారు.

- జి.శ్రీనివాసరావు,శాంతికుమారి, సాకుర్రు



అమ్మ లేకున్నా.. నానమ్మకు..

తల్లి లేని ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు జమైంది. ఆనందంగా ఉంది. మా అబ్బాయి దిమ్మిలి దేవదాసు వ్యవసాయ కూలీ. కొంత కాలం కిందట అతని భార్య చనిపోయింది. దీంతో ముగ్గురు పిల్లల సంరక్షణ నేనే చూస్తున్నా.ఇచ్చిన మాటకు కట్టుబడి సొమ్ములు వేసిన కూటమి ప్రభుత్వానికి ఇదే మా వందనం.

- నాయనమ్మ సుబ్బలక్ష్మి, చిన్నారులు

ఎస్సీ విద్యార్థులకు జమకాలేదు..

రాజమహేంద్రవరం అర్బన్/ కాకినాడ కార్పొరేషన్, జూన్13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థినీ.. విద్యార్థులకు తల్లికి వందన పథకంలో డబ్బులు వారి బ్యాంకు అకౌంట్‌కు జమ కాలేదని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఎంఎస్ శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో 2,660 మంది, కాకినాడ జిల్లాలో 2367 మందికి సొమ్ములు జమ కాలేదని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 8, 9 తరగతులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు 557 మంది తల్లుల అకౌంట్‌కు ఇంకా డబ్బులు జమ కాలేదన్నారు. అదే విధంగా కాకినాడ జిల్లాలో 9,10 తరగతి చదువుతున్న విద్యార్థులు 500 మందికి వారి తల్లుల ఖాతాల్లో జమ కావాల్సి ఉందన్నారు. తల్లికి వందనం డబ్బులు జమకాని తల్లిదండ్రులు కంగారుపడాల్సిన అవసరం లేదన్నారు. వెంటనే దగ్గరలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. ముందుగా సమస్య ఏమిటనేది తెలుసుకోవాలన్నారు. అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు చేపడితే రెండో విడతలో వస్తుందన్నారు.అర్హుల జాబితాలో ఉండి సొమ్ములు పడకపోయినా ఇబ్బందిలేదన్నారు.



నేడు సచివాలయాల్లో ప్రత్యేక మేళా

సచివాలయాల్లో శనివారం ఉదయం 11 గంటలకు మేళా నిర్వహిస్తున్నారు. సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/వార్డు ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని సంప్రదించాలి. అర్హుల జాబితాలో ఉన్నా సొమ్ము పడక పోవడానికి ప్రధాన కారణం.. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)లో ఆధార్‌ను అనుసంధానం చేసుకోకపోవడమే.బ్యాంకు అకౌంట్ ఉన్న వారు ఎన్‌పీసీఐకి ఆధార్ అనుసంధానం చేసుకుంటే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సొమ్ములు జమవుతాయి.అయితే కాస్త సమయం పడుతుందని సమాచారం. తల్లికి వందనం పథకంలో ఆర్థిక సహాయం పొందడానికి పోస్టాఫీసులో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)లో అకౌంట్ ఓపెన్ చేసుకుంటే నగదు జమవుతుందని చెబుతున్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేసుకోవడంతోపాటు ఎన్‌పీసీఐలో ఆధార్ అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది.

మా పిల్లల చదువుకు వినియోగిస్తాం..



నా ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు జమయ్యాయి. ఆనందంగా ఉంది. మాది బిక్కవోలు మండలం రంగాపురం..శుక్రవారం ఉదయం మెసేజ్ వచ్చింది.. ఏమిటా అని చూస్తే రూ.39 వేలు జమయ్యాయి. సొమ్ము బ్యాంకులోనే ఉంచి మా పిల్లల చదువుకు వినియోగిస్తాం.

- తనుబోయిన అనూష, వెంకటరమణ, బిక్కవోలు

ముగ్గురికి రూ.39 వేలు పడ్డాయి..



చంద్రబాబు చెబితే చేస్తారని తెలుసు.. బాబును నమ్మాం.. బాగుపడుతున్నాం.. మాది కడియం మండలం దుళ్ల.. నా పేరు తొట్టా స్వాతి. నా భర్త సత్తిబాబు ఆటో డ్రైవరు.. మాకు ముగ్గురు అమ్మాయిలు...నా ఖాతాలో రూ.39 వేలు జమయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

- తొట్టా స్వాతి, సత్తిబాబు, దుళ్ల, కడియం మండలం.

అన్నమాట నిలబెట్టుకున్నారు...



పాఠశాలల ప్రారంభం మరుసటి రోజునే తల్లికి వందనం వేయడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని, అన్నమాట నిలబెట్టుకున్నారు. మా ముగ్గురు కుమార్తెలకు రూ.39 వేలు పడ్డాయి.

- ఎస్.శ్రీనివాసరావు, త్రిలోకసుందరి, గంగలకుర్రు (పెదపాలెం)

చంద్రన్నకు వందనం



మాకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి.. శుక్రవారం ముగ్గురికి అమ్మకు వందనం సొమ్ము జమైంది. దీంతో మా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది. గత ప్రభుత్వంలో మణికంఠకు మాత్రమే ఇచ్చారు.

- ఉప్పు నాగరాజు,నాగమహాలక్ష్మి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం

రూ.39 వేలు..చదువులకే ఖర్చు చేస్తాం..



మాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురు బంగారు తల్లులే. శుక్రవారం రూ.39 వేలు పడ్డాయి. ఎంతో ఆనందం కలిగింది. గతంలో ఒకరికే పడేది.. ఇప్పుడు ముగురికి డబ్బులు పడ్డాయి. వారి చదువుకే ఖర్చు చేస్తా.

- త్రినాథుల శివశంకర్, మల్లిక దంపతులు, దుర్గాడ

ఇది మంచి ప్రభుత్వం



మాది కాకినాడ జగన్నాథపురం. మాకు ఇద్దరు అమ్మాయిలు. రౌతు అవంతిక, రౌతు నక్షత్ర. కాకినాడ గొడారిగుంటలో చదువుతున్నారు. మా ఇద్దరు పిల్లలకు ఇచ్చారు. ఇది మంచి ప్రభుత్వం. చాలా సంతోషంగా ఉంది. చంద్రబాబు హామీ ఇచ్చారు.. నెరవేర్చారు.

- రౌతు సంధ్యాకుమారి, జగన్నాథపురం, కాకినాడ

కోకో గింజల కొనుగోలుకు

ప్రభుత్వం సిద్ధం

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వాస్తవ రైతుల నుంచే కోకో గింజలు సేకరణకు తహశీల్దార్,ఉద్యాన అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెలాఖరులోపు వాస్తవ సాగుదారులు నుంచి కోకో దిగుబడులను పూర్తి సేకరిస్తామన్నారు. కిలో రూ.500 చొప్పున రైతుకు ధర చెల్లిస్తే ప్రభుత్వం రూ.50 చొప్పున కంపెనీలకు రీయింబర్స్ చేస్తుందన్నారు. మిగిలిన సరుకు ఈ నెల 30వ తేదీలోగా సేకరించాలని అధికారులకీ లక్ష్యం నిర్దేశించామన్నారు. కోకో రైతుల నుంచి వినతులు స్వీకరించడం కోసం కొవ్వూరు ఆర్‌డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. సోమవారం నుంచి అందుబాటులో ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినతులు స్వీకరిస్తారన్నారు.ఈ మేరకు కంట్రోల్ రూమ్ 79953 67797 నెంబరు ఏర్పాటు చేశామన్నారు.



చినుకు పడుతున్నా..చిరు ఆశ

ఆరుగాలం పండిస్తారు.. అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడతారు.. చాలా మంది మామిడి రైతులు దళారీలను తట్టుకోలేక సొంతంగా అమ్ముకునేందుకే ఇష్టపడతారు..ఎందుకంటే డబ్బులు కనిపిస్తాయని ఆశ..ఎన్ని కష్టాలొచ్చినా ఆ ఆశ వీడరు.. రాజమండ్రిలో శుక్రవారం కెమెరాకు చిక్కిన ఈ చిత్రమే నిదర్శనం.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



గోదావరి రివర్ ఫ్రంట్ మారనుందిలా..

గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుందే!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం మారబోతోంది. మరింత సుందరంగా కనిపిం చబోతోంది. నగరానికి మరో ఆహ్లాదం. మరో మోదం గోదావరి రివర్ ఫ్రంట్.రోడ్డు పార్కు కలిసి వస్తుంది.హైదరాబాద్ ట్యాంక్ బండ్.. వైజా గ్ బీచ్ రోడ్డును తలపించేలా.. గోదావరి రివర్ ఫ్రంట్ మారబోతోంది. గోదావరి నీటి గలగలలు, చల్లటి గాలి, నీటి ప్రవాహం ఒయ్యారం చూస్తూ రివర్ ఫ్రంట్‌లో కూర్చుంటే తనివి తీరా ఆహ్లాదమే. ఇక్కడ అధికారులు రూపొందించిన డిజైన్లు చూడముచ్చటగా ఉన్నాయి. పీవీ నరసింహారావు పార్కు నుంచి గౌతమి నందనవనం వరకూ 550 మీటర్ల పొడవున ఈ రివర్ ఫ్రంట్ నిర్మించనున్నారు.దీనికి మొత్తం రూ.22 కోట్ల వ్యయ అంచనా వేశారు. దీనిని అప్పర్, లోయర్ విభాగాలుగా విభజించారు. మొదటి ప్యాకేజీని రూ.14 కోట్లతో చేస్తు న్నారు.అందులో పద్మావతి ఘాట్ వద్ద బ్రిడ్జి, రివర్ ఫ్రంట్ భాగం నిర్మిస్తారు. ఇక్కడ గ్రీనరీ, సీటర్స్, లైటింగ్, ప్లాజా ప్లేసెస్ (కూర్చో వడానికి వీలుగా),రోడ్డు వైపు ఓపెన్‌గా ఉండేటట్టు నిర్మించనున్నారు. పద్మావతి ఘాట్ వద్ద గ్యాప్‌లో 83 మీటర్ల బ్రిడ్జిని నిర్మిస్తారు. నదిలో 35 అడుగుల లోతులో పైల్ ఫౌండేషన్ వేస్తున్నారు. ప్రస్తుతం బ్రిడ్జి టెస్ట్ పైల్ నిర్మిస్తున్నారు. దీనిని 9 నెలలో పూర్తి చేయాల్సి ఉంది. కానీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆరు నెలలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇక్కడ పిండ ప్రదానాల రేవు, ప్రము ఖల విగ్రహాల విషయమై అఖిలపక్షంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఇప్ప టికే చర్చించిన సంగతి తెలిసిందే. రివర్ వైపు లోయర్ ప్రాంతంలో మిగతా సొమ్ముతో పనులు చేయనున్నారు. ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ డిజైన్లను రూపొందిస్తుంది.త్వరలో టెండర్లు పిలవనున్నారు.



హుకుంపేటలో విచారణ నిర్వహిస్తున్న డీఏవో, డీఎల్‌పీవో (ఫైల్)

విచారణ హుళక్కేనా!

- » డీఏవో బదిలీపై భిన్నవాదనలు
- » పంచాయతీలపై విచారణ ఎలా

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో 2019-24 సంవత్సరాల మధ్యకాలంలో బిల్డింగ్ ఫీజులు, ఆస్తి పన్నులు జమచేయడంలో పంచాయతీ అధికారులు భారీ మొత్తంలో అవకతవకలకు పాల్పడినట్టు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి ముగ్గురు అధికారులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపట్టి వారం రోజుల్లో నివేదిక అందజేయాలని నివేదికలో పేర్కొన్నారు. విచారణాధికారులుగా జిల్లా ఆడిట్ అధికారి ఆర్.పద్మజారాణి, డీఎల్‌పీవో నాగలత, రూరల్ ఇన్‌చార్జి తహశీల్దార్ శ్రీనివాసరావు లను నియమించారు. దీనిపై ఈ నెల 6వ తేదీన హుకుంపేట పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. జిల్లా ఆడిట్ అధికారి పద్మజారాణి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో (గత నాలుగేళ్లకు సంబంధించి) బిల్డింగ్ ఫీజుల వివరాలతో పాటు గతేడాదికి సంబంధించి రీఆడిట్ నిర్వహించి జిల్లా కలెక్టరు ఆదేశాల ప్రకారం వారం రోజుల్లో నివేదిక సమర్పిస్తామని తెలిపారు. అక్కడ వరకు బాగానే ఉంది.అయితే విచారణ పూర్తి కాకుండానే జిల్లా ఆడిట్ అధికారి (డీఏవో) పద్మజారాణిని పక్కన పెట్టి ఆ అధికారి కంటే జూనియర్‌గా ఉన్న మరొక అధికారి సుబ్బా రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఆర్‌జేడీ కల్యాణి 10వ తేదీన ఉత్తర్వులు జారీ చేశా రు.ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్టు సమాచారం. విచారణ నివేదికలు బయటకు వస్తే గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పాటు పంచాయతీరాజ్‌కు సంబంధించి మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారుల జాతకాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే విచారణాధికారి మార్పునకు ప్రధాన కారణమని పలువురు విమర్శిస్తున్నారు. హుకుంపేట పంచాయతీ పరిధిలో లక్షలాది రూపాయల బిల్డింగ్ ఫీజులు పంచాయతీ ఖాతాకు జమ చేయకుండా పక్క దోవ పట్టినట్టు తెలుస్తుంది. కోలమూరు పంచాయతీలో కూడా అవకతవకలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ పంచాయతీ పరిధిలో బిల్డింగ్ ఫీజులకు సంబంధించి సుమారు రూ.75 లక్షల మేర నిధులు దుర్వినియోగమైనట్టు వినికిడి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై ప్రస్తుత గ్రామ కార్యదర్శి తరచు విజి లెన్స్ అధికారుల ముందు హాజరవుతుండడం విశేషం.

బరిలోకి దిగితే.. పతకాల పంటే


కర్రసాము చేస్తున్న రాయుడు జోత్న్న, జోష్మితసత్యశ్రీ

- కర్రసాములో సత్తా చాటుతున్న అక్కాచెల్లెలు
- రాష్ట్రస్థాయిలో ఐదు స్వర్ణ పతకాలు
- ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన జోత్న్న
- కత్తిసాములోను ప్రతిభ కబరుస్తున్న వైనం

ఆ అక్కాచెల్లెళ్లు కర్రసాములో ఆరితేరారు. కర్ర పట్టారంటే పతకం కొట్టాల్సిందే.. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు.. రాష్ట్రస్థాయి పోటీల్లో ఐదు స్వర్ణపతకాలు సాధించి ఔరా అనిపిస్తున్నారు. వీరిలో అక్క కత్తిసాములోను ప్రతిభ కనబరుస్తూ ఆకట్టుకుంటోంది.

అమలాపురం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ప్రముఖ పంచాంగకర్త ఉపద్రష్టవారి ఇంట అక్కాచెల్లెలు జోత్న్న, జోష్మితసత్యశ్రీ కర్రసాములో శిక్షణ పొందారు. రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో అద్భుత ప్రతిభ చాటి ఐదు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సాధించడంతోపాటు అక్క జోత్న్న ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచింది. అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన రాయుడు రమేష్‌బాబు-సౌజన్య దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ఆధునిక సమాజంలో ఆత్మరక్షణ విద్య ఆవశ్యకతను ఆ తల్లిదండ్రులు గుర్తించారు. ఇద్దరు కుమార్తెలకు మూడేళ్లుగా కర్రసాము, కత్తిసాము విద్యల్లో శిక్షణ ఇప్పించారు. అమలాపురం పట్టణానికి చెందిన ఉపద్రష్ట నాగాదిత్యన్, విమలాదిత్యన్, విక్రమాదిత్యన్, విజయాదిత్యన్‌ల వద్ద 60మంది కర్రసాము శిక్షణ పొందుతుండగా వారిలో 15 మంది విద్యార్థినులు ఉన్నారు. వారితోపాటు శిక్షణ పొందిన రమేష్‌బాబు కుమార్తెలు జోత్న్న, జోష్మితసత్యశ్రీ ఇటీవల గుంటూరు జిల్లా పెదనందిపాడులో జరిగిన రాష్ట్రస్థాయి తొలి కర్రసాము టోర్నమెంట్-2025 పోటీల్లో అక్కాచెల్లెలు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన అక్కాచెల్లెలు జోత్న్న, జోష్మితసత్యశ్రీ

ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా..

రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో జోత్న్న నాలుగు స్వర్ణ పతకాలతోపాటు ఒక రజత పతకం సాధించింది. రాష్ట్రం నలుమూలలనుంచి వందలాది మంది ఈ పోటీల్లో పాల్గొన్నప్పటికీ అద్భుత ప్రతిభతో జోత్న్న ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచింది. ఇక సోదరి జోష్మితసత్యశ్రీ సబ్ జూనియర్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. కర్రసాముతోపాటు కత్తిసాములోను అక్కాచెల్లెలు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. జోత్న్న ప్రస్తుతం 7వ తరగతిలోకి రాగా సత్యశ్రీ 5వతరగతి చదవుతుంది. మంగళవారం ఉపద్రష్టవారి ఇంట జరిగిన కార్యక్రమంలో అక్కాచెల్లెలు ఇద్దరినీ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా శిక్షణ ఇస్తామని నాగాదిత్యన్ సోదరుడు ప్రకటించారు.

నెక్స్ట్ ఏంటి?



- ఇంటర్ తర్వాత ఏం చేయాలి?
- ఇంజనీరింగ్‌లో ఏ కోర్సు తీసుకోవాలి?
- విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య చర్చ

ఇంటర్ ఫలితాలొచ్చాయ్.. మంచి మార్కులతో పాసయ్యారు.. ఏపీఈఏపీసెట్ ర్యాంకులు కూడా వచ్చేశాయి. ఇంజనీరింగ్, డిగ్రీ.. వీటిలో నెక్స్ ఏంటి? మీ గోల్ ఏంటి? ప్రస్తుతం చాలా ఇళ్లల్లో ఇదే చర్చ.. చాలామంది విద్యార్థులు, వారి తల్లిదండుల్ర మధ్య కూడా ఇదే టాపిక్ నడుస్తోంది.. ఏ కోర్సు చేస్తే బాగుంటుందనే విషయంపైనే చర్చ. డిగ్రీ చేసేద్దామనుకునే వారు కొందరైతే.. ఇంజనీరింగ్ చేయాలని మరికొందరు ఆలోచిస్తున్నారు. దీనిపై ప్రత్యేక కథనం..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏపీఈఏపీ సెట్ పరీక్షలు ముగిశాయి. త్వరలోనే ఫలితాలు వెలువడనున్నాయి. అనంతరం కౌన్సెలింగ్ కూడా జరగనుంది. ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతుంటారు. ఏ బ్రాంచి తీసుకోవాలి? ఏ కళాశాలైతే బాగుంటుందనే సందేహాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వేధిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఏకోర్సుకు ప్రాధాన్యమివ్వాలి? ఏ కోర్సు చేస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయి? నాలుగేళ్ల ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేయాలంటే ఏం చేయాలి? ఏ కోర్సుకు బాగా ఆదరణ ఉంది? అనే విషయాలపై ప్రస్తుతం చర్చ విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు, స్నేహితుల మధ్య సాగుతోంది.

ఏం రంగం ఇష్టం..

ముందుగా విద్యార్థులు తమకు ఇష్టమైన రంగం ఏంటో తెలుసుకోవాలి. కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఈఈఈ, సివిల్, ఈఐ, ఐటీ వంటి కోర్సుల్లో ఏదైతే మనకు సరిపోతుంది?, ఎందులో అయితే మనం రాణించగలం అనే విషయమై స్పష్టత రావాలి. మన సామర్థ్యం ఏమిటో ఆలోచించుకుని దానికి తగ్గట్టుగా బ్రాంచిని ఎంపిక చేసుకోవాలి. లేకుంటే కోర్సు పూర్తి చేయలేక విద్యాసంవత్సరం వృథా అవుతుంది.

కళాశాల గురించి తెలుసుకోండి..

విద్యార్థులు తాము చేరబోయే కళాశాల గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలి. కళాశాలలో మౌలిక సదుపాయాలు, న్యాక్, అటానమస్, ఎన్‌బీఏ తదితర గుర్తింపులు ఉన్నాయో లేదో! చూసుకోవాలి. అక్కడ చదువుతున్న సీనియర్ విద్యార్థుల ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. కళాశాలలో విద్యాబోధన ఎలా ఉంటుంది? ఎక్స్‌పర్ట్ ఫ్యాకల్టీ ఉంటున్నారా? క్యాంపస్ ఇంటర్వ్యూలకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఏమైనా ఇస్తున్నారా? వంటి వివరాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. కళాశాల వాతావరణం, క్రమశిక్షణ, నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చే కళాశాలలను పరిశీలించుకోవాలి.

కోర్ బ్రాంచీలపై దృష్టి పెట్టండి

ప్రస్తుతం విద్యార్థుల చూపంతా సీఎస్ఈ, ఐటీ, ఈసీలపైనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ప్రభావం, ఐటీ రంగంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు లేకపోవడంతో నూతన జాతీయ విద్యా విధానంలో వచ్చిన మార్పులతో కోర్ బ్రాంచీలపైనా దృష్టిసారించాలని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కోర్ బ్రాంచీలైన మెకానికల్, ఈఈఈ సివిల్ విద్యార్థులు ఈ సబ్జెక్టును చదువుకోవచ్చు.

ఈఈఈ విద్యార్థులకు అవకాశాలు

ఇంజనీరింగ్‌లో ప్రధానంగా ఈఈఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌ల విద్యార్థులను కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఆయా సంస్థలు ఎంపిక చేసుకుంటున్నాయి. వీరు ఇటు సాఫ్ట్‌వేర్ రంగంతోపాటు తమ కోర్ సంస్థల్లో కూడా ఎంపిక కావచ్చు. ఈ బ్రాంచ్ విద్యార్థులకు కాగ్నిజెంట్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, క్యాప్‌జెమినీ, హుందయ్ మోటార్స్, అశోక్ లేలాండ్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, కేసీపీ లిమిటెడ్, రామ్‌గ్రూప్, వీఈఈ టెక్నాలజీస్, జాస్పర్ ఇండస్ట్రీస్ వంటి ప్రముఖ సంస్థలు ఉద్యోగాలు ఆఫర్ చేస్తున్నాయి. గ్రీన్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ ప్రాముఖ్యం ఉన్న నేపథ్యంలో ఈఈఈ విద్యార్థులకు అవకాశాలు అధికం. బీటెక్‌లో ఏం బ్రాంచ్ చదివినా ఎంటెక్‌లో కంప్యూటర్స్ సంబంధిత కోర్సు చేయొచ్చు.



సముద్రంలో చేపల వేటకు వేళాయె...


నేటి అర్ధరాత్రి బయల్దేరనున్న బోట్లు ... వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు

కాకినాడ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల విరామం తర్వాత సముద్రంలో చేపల వేటకు ఫిషింగ్ బోట్లు సిద్ధమవుతున్నాయి. మత్స్య సంపద వృద్ధి, పరిరక్షణ నిమిత్తం ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్ర జలాల్లో చేపల వేటపై నిషేధం విధించారు. ఇది శనివారం అర్ధరాత్రి ముగియనుంది. జీవో ఆర్టీ నెం.129 ప్రకారం సముద్ర జలాల్లో యాంత్రిక పడవలు, మర పడవలు (మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లు)తో ఏ రకమైన చేపల వేట సాగించకుండా కట్టుదిట్టం చేశారు. నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘించి చేపల వేట సాగించే బోట్ల యజమానులు ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994 సెక్షన్ (4) ప్రకారం శిక్షార్హులు కాగలరని విస్తృతంగా ప్రచారం చేపట్టారు. వేట సాగించే బోట్లను, వాటిలోని మత్స్య సందపను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తామని, బోట్ల లైసెన్సలను రద్దు చేయడంతో పాటు డీజిల్ ఆయిల్ సబ్సిడీ, ఇతర సబ్సిడీలు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. నిషేధ కాలాన్ని కచ్చితంగా అమలు చేసేందుకు మత్స్య శాఖ కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, రెవెన్యూ యంత్రాంగంతో గస్తీ పెట్టారు. కాకినాడ జిల్లాలో మెకనైజ్డ్ బోట్లు 395, మోటరైజ్డ్ బోట్లు 3,694 ఉన్నాయి. కాకినాడ, ఉప్పాడ, తాళ్లరేవు, తొండంగి తీర ప్రాంతం నుంచి మత్స్యకారులు బోట్లు ద్వారా సముద్ర జలాల్లో చేపల వేట సాగిస్తున్నారు. వీటిపై ఆధారపడి 25,419 మంది జీవనోపాధి పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం జిల్లాలో వేట నిషేధ పరిహారంగా ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున 25,419 మందికి రూ.50.83 కోట్లు అందజేసింది. నిషేధం గడువు ముగియడంతో బోట్లు, వలలకు మరమ్మతులు చేయించుకుని డీజిల్, నిత్యావసర సరుకులు సమకూర్చుకుని మత్స్యకారులు వేటకు సన్నద్ధమవుతున్నారు.


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.31లక్షలు

ఆత్రేయపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,31,934 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అమలాపురానికి చెందిన వరదా శరణ్‌కుమార్-సూర్యనాగవెంకట అమృత దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. కరపకు చెందిన గొర్రెల్ల సాయి వెంకటవంశీ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళం సమర్పించారు. విజయవాడకు చెందిన పచ్చిపులుసు రామకృష్ణ-లీలాశ్రీ నిర్మలకుమారి దంపతులు రూ.51,116 విరాళాలను సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందించిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

భీమేశ్వరాలయంలో ప్రముఖుల పూజలు


సైబరాబాద్ ఏసీపీ పద్మజకు వేదాశీర్వచనం ఇస్తున్న పండితులు

సామర్లకోట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి శుక్రవారం సైబరాబాద్ ఏసీపీ పద్మజ, విజయవాడ రైల్వే ఏసీబీ జడ్జి ఆర్.వెంకటేశ్వరరావు దంపతులు విచ్చేశారు. వారు భీమేశ్వర స్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదాలుస్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. నిత్యాన్న దాన పథకానికి సామర్లకోటకు చెందిన పస్తుల రత్నలీల-శ్రీసత్యసూర్యనారాయణ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని చెక్కు రూపంలో ఈవో నీలకంఠానికి అందజేశారు. దాత దంపతులకు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి వేదాశీర్వచనం ఇచ్చారు. చిత్రపటాలను ఈవో బహూకరించారు.


ఏసీబీ జడ్జి దంపతులకు వేదాశీర్వచనం పండితులు

ఈటీసీ ప్రిన్సిపాల్‌గా ప్రసాదరావు బాధ్యతల స్వీకారం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రసాదరావు

సామర్లకోట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా కరుటూరి నాగ వర ప్రసాదరావు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఎంపీడీవోగా పనిచేశారు. 25 ఏళ్ల క్రితం వీడీవోగా అప్పటి వీడీవో శిక్షణ కేంద్రంలో తొలిసారిగా శిక్షణ పొందారు. తిరిగి అదే కేంద్రం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రసాదరావును అధికారులు, సిబ్బంది అభినందించారు. ఆయనకు డ్వామా ప్రత్తిపాడు ఏపీడీ మోకా భానుప్రకాష్ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిశారు.

సముద్ర తీరంలో జాతీయజెండాలతో యోగా


జాతీయజెండాలతో యోగా చేస్తున్న మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

పిఠాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన మన ఊరు-మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శుక్రవారం వినూత్న రీతిలో యోగాంధ్ర నిర్వహించారు. సంస్థ సభ్యులు ఉప్పాడ సముద్ర తీరంలో జాతీయ జెండాలతో యోగాసనాలు వేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, సభ్యులు కేవీఎస్ఎస్ ప్రసాద్, పెమ్మరాజు సత్యరామచంద్రరావు, రాయుడు శ్రీనుబాబు,నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కనుమరుగు



మానవ తప్పిదాలతో కొన్ని, ప్రకృతి కన్నెర్రతో మరికొన్ని భారీ వృక్షాలు కనుమరుగవుతున్నాయి. వందల సంవత్సరాలకు పైగా వయసుండే వృక్షాలు రాజమహేంద్రవరం నగరంలోని సెంట్రల్ జైలు పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయి. జైలు ఆధునీకరణ, ప్రైవేటు హోటల్ నిర్మాణ సమయంలోను చాలా వృక్షాలను తొలగించారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సెంట్రల్ జైలు పార్కులో మరో వృక్షం నేలకూలింది. దాంతో సిబ్బంది ఆ వృక్షాన్ని ముక్కలుగా చేసి తరలించారు.

-ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం.

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న

బీఎస్ఎఫ్ ఆర్ఎస్ఐ దేవానందంకు సత్కారం


దేవానందంను సత్కరిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో బీఎస్ఎఫ్ ఆర్ఎస్ఐ ఆర్.దేవానందం పాల్గొన్నారు. శుక్రవారం ఆయన్ను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు సత్కరించారు. దేవానందం మాట్లాడుతూ బీఎస్ఎఫ్ 40 సంత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్నానని, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నందుకు చాలా సంతోషపడుతున్నానని అన్నారు. అదనపు కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మోహన్‌రావు, చంద్రశేఖర్‌రావు, ఆర్ఐ రాము, యూనిట్ వైద్యాధికారి శ్రీరామ్ పాల్గొన్నారు.



ఎండల్లో.. హాయ్ హాయ్



అమలాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి యానాం నుంచి ద్రాక్షారామ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై దారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు చెట్లయ్యాయి. మండు వేసవిలో సైతం ఆ రహదారిపై పయనం ఎండల్లో హాయ్ హాయ్ అన్నట్టుగానే ఉంటుంది.

725.. నో సర్టిఫై!



- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3970 స్కూల్ బస్సులు
- ఇంకా పూర్తికాని 725 బస్సుల ఫిట్‌నెస్
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం
- ఫిట్‌లో రవాణా శాఖ పాత్ర సున్నా
- 'అన్నీ' ప్రైవేటు సంస్థే.. తీవ్ర ఆరోపణలు
- తెరుచుకున్న పాఠశాలలు
- ఆందోళనలో తల్లిదండ్రులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మీ పిల్లలు బడి బస్సులో వెళ్లి వస్తున్నారా? ఆ వాహనానికి ఫిట్‌నెస్ (ప్రయాణించే సామర్థ్యం) ఉందో లేదో చూసుకోండి మరి. ఎందుకంటే పాఠశాలలు తెరిచేసినా ఇంకా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొం దని బస్సులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందల్లో ఉన్నాయి. 2025-26 నూతన విద్యా సం వత్సరం ఈ నెల 12 నుంచి ప్రారంభమైంది. అ యితే ఇంకా ఉమ్మడి జిల్లాలో బడి బస్సుల సామ ర్థ్య పరీక్షలు అన్నిటికీ పూర్తి కాలేదు. ఫిట్‌నెస్ పూర్తయిన వాటిపైనా పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులు బస్సుల్లోనే వెళ్లి వస్తుంటారు. విద్యార్థులను ఎక్కించుకునే బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉండాలి. ప్రతి ఏడాదీ ఈ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు రెండేళ్లకు పొడిగించారు. మార్చి వరకూ రోడ్డు రవాణా అధికారులు నిబంధనల ప్రకారం తనిఖీ చేసి ఆ ధ్రువపత్రాన్ని జారీ చేయడం జరిగేది. కానీ ఆ తంతును ప్రైవేటుకు అప్పగించడంతో ఫిట్‌నెస్‌పై ఆందోళన వ్యక్తమవుతోంది. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ సిస్టం ద్వారా ప్రైవేటు సంస్థ ఫిట్‌నెస్ ధ్రువీకరణ చేస్తోంది. కోనసీమ జిల్లాలో ఏటీఎస్ నిర్మాణంలో ఉండడంతో రవాణా అధికారులు వాహన సామర్థ్య పరీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంకా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందని బస్సులు వందల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

● సర్టిఫికెట్ జారీ ఇలా..

రవాణా శాఖ ఆవిర్భావం నుంచి స్కూల్ బస్సులకు ఆ శాఖే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తోంది. వాహనాన్ని రవాణా అధికారులు భౌతికంగా నిబంధనల ప్రకారం తనిఖీ చేసి ఒక వేళ ఏవైనా మరమ్మతులు ఉంటే చేయించుకున్న తర్వాత ధ్రువపత్రం జారీ చేసేవారు. చాలామంది అలసత్వం వహిస్తుండడంతో రవాణా శాఖ ఓ వెబ్‌సైటు రూపొందించింది. వెబ్‌సైటులో నేరుగా పాఠశాల యజమానులు బస్సుల వివరాలు, డ్రైవర్ల వివరాలను అప్‌లోడ్ చేసుకునేలా వెసులుబాటు కల్పించారు. వెబ్‌సైటులో స్కూల్ వివరాలను పూర్తిగా నమోదు చేయాలి. తర్వాత వచ్చే ధ్రువపత్రాన్ని ప్రింట్ తీసుకుని స్థానిక రవాణా అధికారి వద్దకు వాహనంతో వెళ్తే నిబంధనల ప్రకారం తనిఖీలు నిర్వహించి బ్రేక్ నిమిత్తం చలానా కట్టిస్తారు.

● వైసీపీ నిర్వాకం

కానీ వైసీపీ ప్రభుత్వం ఈ విషయంలో కూడా నిర్వాకాన్ని వెలగబెట్టింది. శి క్షణ పొందిన అధికారులను కాదని ఫిట్‌నెస్ జారీని పూర్తిగా ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. దానినే ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. వాస్తవానికి కేంద్రప్రభుత్వం ఈ విధానానికి సంబంధించిన నిర్దేశాలను అన్ని రాష్ట్రాలకూ జారీ చేసింది. అయితే చుట్టుపక్కల రాష్ట్రాల్లో ఈ విధానం అమల్లో ఉన్నా నియంత్రణ మాత్రం రవాణా శాఖ చేతుల్లోనే ఉంచారు. మన దగ్గర మాత్రం పూర్తిగా ప్రైవేటుకే ధారాదత్తంచేయడంతో 'రేటు' పెట్టి మరీ పనులు కానిచ్చేస్తున్నారని చెబుతున్నారు. స్కూల్ బస్సుల సామర్థ్య ధ్రువీకరణలో కూడా రూ.4వేల నుంచి రూ.12వేల వరకూ అదనంగా వసూలు చేస్తూ బస్సు ఏటీఎస్‌కి వెళ్లక పోయినా, నెంబరు ప్లేట్లు మార్చి తీసుకొస్తున్నా పని కానిచ్చేస్తున్నారనే ఆరోపణలతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పైసొమ్ము ఇవ్వకపోతే ఏదో సాకు చూపించి వేధిస్తున్నారని అంటున్నారు. ఇటీవల ఓ ఆటోవాలా ఫిట్‌నెస్‌కి వెళ్లగా పైసొమ్ము ఇవ్వలేదనే సాకుతో వేధించడంతో ఆవేదనతో తన ఆటో అద్దం తనే బద్దలు కొట్టుకొని నిరసన తెలిపాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి సర్దుబాటు చేయాల్సి వచ్చింది. అలాగే ఎఫ్‌సీ ఒక వాహనం పేరున ఉండి.. మరో వాహనం నెంబరుతో ఎఫ్‌సీ ఉండడం వంటి కూడా ఉంటున్నా యని చెబుతు న్నారు. కొన్ని రాష్ట్రాలు ప్రైవేటు సంస్థ ఫిట్‌నెస్ చూసే ప్రదేశంలో రవాణా శాఖ నుంచి అనుభవం కలిగిన అధికారులను నియమించి జాగ్రత్తగా అమలు చేస్తున్నాయి. మన దగ్గర మాత్రం పూర్తిగా ప్రైవేటుకే దాసోహం అయిపోయారు. ఆర్టీవోకి కూడా లాగిన్ అధికారం లేకుండా పోయి ంది. విద్యార్థుల విషయంలో ఈ తంతు ప్రమా దానికి కోరలు ఇచ్చినట్లుగా ఉందనే వాదన వినవస్తోంది.

● అటువైపు చూడొద్దు

సదరు ప్రైవేటు సంస్థ వైపు కన్నెత్తి చూడొద్దని రవాణా అధికారులకు ఆదేశాలు ఉండడంతో అచేతనంగా ఉండాల్సి వస్తోంది. అసలు నిబంధనలు పాటిస్తున్నారా? అనే విషయంలో కూడా స్పష్టత ఉండడం లేదు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ద్వా రా తనిఖీలు చేస్తున్నారని చెబుతున్నారు. అయితే ఆ యంత్రాల పనితీరుపై తనిఖీలు లేవు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే అధికారులు చూస్తున్నారని అంటున్నా.. దానిలో నిజంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టప్రకారం సుమారు 50 రకాల నిబంధనలను ఫిట్‌నెస్ కోసం తనిఖీ చేయాల్సి ఉంటుంది. వాటిలో కొన్నిటిని భౌతికంగా పూర్తి చేయాలి. కానీ తూతూమంత్రంగా కానిచ్చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పైగా గతంలో కొవ్వూరు, రాజమండ్రిలో తనిఖీలు నిర్వహించే వారు. ప్రైవేటు కంపెనీ మాత్రం ఒకే చోట ప్రక్రియ పూర్తిచేస్తోంది. దీంతో వాహనదా రులు ఇబ్బంది పడుతున్నారు.

ఈ బస్సుల సంగతేంటి..!

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చూస్తే తూర్పు గోదావరిలో 1572 స్కూల్ బస్సులు ఉండగా 1300, కాకినాడ జిల్లాలో 1200కు 1050, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1203కు 900 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తయింది. ఇంకా 725 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తి కాలేదు. ఇవి రోడ్లపై తిరిగితే ప్రమాదాన్ని ఆహ్వానించినట్టే.

తల్లిదండ్రుల బాధ్యత ఏంటి?

పిల్లలను ఉదయం స్కూల్ బస్సు ఎక్కించడం, సాయంత్రం దించి ఇంటికి తీసుకెళ్లడం ఒకటే తల్లిదండ్రుల బాధ్యత అనుకుంటే పొరబాటే. పిల్లలు ప్రయాణించే బస్సు, డ్రైవరు, కండక్టరు పరిస్థితులు గమనిస్తూ ఉండాలి. బస్సు కండీషన్‌ని పరిశీలిస్తుండాలి. యాజమాన్యం నిబంధనలు పాటించకపోతే రవాణా, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. డ్రైవర్, అటెండర్ తీరును గమని స్తుండాలి. వాహనం నడిపే సమయంలో, పిల్లలను ఎక్కించేటప్పుడు, దించేటప్పుడు బాధ్యతగా ఉన్నాడా? సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారా? బస్సు లో పొగతాగడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం వంటివి చేస్తున్నారా? ముఖ్యంగా విద్యార్థినులతో వారి ప్రవర్తన ఎలా ఉంది? అనేవి రోజూ గమ నిస్తుండాలి. బస్సు సిబ్బంది ప్రవర్తన ఇబ్బందిగా ఉన్నాసరే తల్లిదండ్రులకు భయపడి కొందరు పిల్లలు విషయాలను దాస్తుంటారు. అందువల్ల పిల్లలను ఆరా తీస్తూ ఉండాలి. చాలామంది డ బ్బులు తగ్గుతాయని, బస్సు సదుపాయం లేక పోవడం వంటి కారణాలతో ఆటోల్లో కుక్కినట్లు పంపిస్తుంటారు. దీని వల్ల పిల్లలు స్కూల్‌కి చేరుకునే సమయానికి అలసిపోతారు. పైగా ప్రమాదం కూడా.

బస్సు ఇలా ఉండాలి..

స్కూల్ బస్సులో పవర్ స్టీరింగ్‌తోపాటు ఫ్రీప్లే చాలా తక్కువగా ఉండాలి. డ్యాష్‌బోర్డు ప్యానెల్‌లో ఎడమ, కుడి సాంకేతాల ఇండికేటర్, ఎయిర్ ప్రెజర్ గేజ్, ఫెయిల్స్ సేఫ్టీ ఇండికేటర్, బ్రేకులలో లోపాలను తెలిపే ఇండికేటర్, ఫ్యూయల్ మీర్, స్పీడో మీటర్ ఉండాలి. డ్రైవర్ సీటు వద్ద ఎయిర్ హ్యాండ్ బ్రేక్, హ్యాండ్ లివర్ గైడ్ స్ప్రింగ్, గేర్ లివర్‌లో అంతర్గత స్ప్రింగ్ ఉండాలి. క్లచ్ ప్లేట్, పెడల్ ఫ్రీప్లే ఒక అంగుళానికి తక్కువ ఉండకూడదు. వెనుక ఉన్న వాళ్లు కనిపించే అద్దం, బస్సులో కూర్చున్న విద్యార్థుల కదలికలు తెలుసుకోడానికి డ్రైవరు వద్ద అద్దం ఉండాలి. ఫుట్‌బోర్డు మొదటి మెట్టు భూమి నుంచి 325 మిల్లీమీటర్లకు మించి ఉండరాదు. ఫుట్‌బోర్డు మొట్ల వద్ద విద్యార్థులు ఎక్క డానికి, దిగడానికి వీలుగా రెయిలింగ్, సరిపడా లైటింగ్ ఉండాలి. సీట్ల కింద లగేజీ బాక్సులు, పార్కింగ్ లైట్లు, అత్యవసర ద్వారం, సురక్షితమైన విండ్ షీల్ (అద్దం), అత్యవసర సమయంలో డోర్ అద్దాలు పగుల గొట్టడానికి సుత్తి, అగ్నిమాపక యంత్రం (పౌడి), బస్సు తలుపులకు సురక్షిత లాకింగ్ సిస్టం, కాన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలు ఉండాలి. సైడ్ విండోలకు మధ్యలో 31 అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా 3 లోహపు కడ్డీలు అమర్చాలి. సీటింగ్ కెపాసిటీకి మించి అంటే విద్యార్థులు నిలబడి ప్రయాణించే విధంగా ఎక్కి ంచుకోవడం నిషేధం. బస్సుకు పసుపు రంగు వేయాలి. డ్రైవర్‌కి కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అత్యవసర ద్వారాలు, సీటు ఆర్‌సీ బుక్ ప్రకారం ఉండాలి. సైడ్‌రాడ్‌లు కనీసం 2, 3 ఉండా లి. ఫస్ట్ ఎయిడ్ బాక్సులో అత్యవసర మందులు అందుబాటులో ఉండాలి. ఫైర్ సిలిండర్ వినియోగానికి సిద్ధంగా ఉండాలి. అటెండర్ వాటిని రోజూ పరిశీలించాలి. డ్రైవర్, ఎంవీఐ సెల్ నెంబర్లు కనిపించేలా ఉండాలి. విద్యార్థుల జాబితా బస్సులో ఉండాలి. లైటింగ్ సిస్టం మొత్తం బాగుండాలి.



ప్లాస్టిక్ కవర్లో పసికందు

అల్లూరి జిల్లా కొక్కిరిగూడెం అటవీ ప్రాంతంలో సంఘటన



ఆసుపత్రిలో పసికందు, వైద్యం చేస్తున్న సిబ్బంది



చింతూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ మరుక్షణమే పసికందుని ప్లాస్టిక్ కవర్లో ఉంచి ఆ కవర్‌ని చెట్టుకు వేలాడదీసి మాయమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా వరరామచంద్రపురం మండలం కొక్కిరిగూడెం అటవీ ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం కొక్కిరిగూడెనికి చెందిన కొందరు అటవీ ప్రాంతానికి వేటకెళ్లారు. వారిలో మడివి రత్నరాజుకు ఓ చెట్టు వద్ద నుంచి పసికందు రోదన వినిపించింది. దీంతో చెట్టుకు వేలాడుతున్న ప్లాస్టిక్ కవర్‌తోపాటు అందులో ఉన్న పసికందుని చూసి నివ్వెరపోయాడు. వెంటనే ఇంటికెళ్లి తల్లి ముత్తమ్మకు విషయాన్ని చెప్పాడు. దీంతో ముత్తమ్మ చెట్టు వద్దకు వెళ్లి పసికందుని తీసుకుని ఇంటికెళ్లింది. విషయం తెలుసుకున్న కుందులూరు సబ్‌సెంటర్ ఏఎన్ఎం గుంపెనపల్లి చంద్రమ్మ బృందం హుటాహుటిన పసికందుని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి నేతృత్వంలో చిన్నపిల్లల వైద్య నిపుణుడు మహేష్ ఆ పసికందుకు వైద్యం అందిస్తున్నారు. బిడ్డ పుట్టి దాదాపు 7,8 గంటలపాటు ఏడవడం, బొడ్డు కూడా కత్తిరించక పోవడంతో పరిస్థితి విషమంగా ఉందని, అయినప్పటికీ వైద్యం అందిస్తామని, పోలీసులకు సమాచారమిచ్చామని కోటిరెడ్డి తెలిపారు.

సముద్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మరణించిన పార్థు (ఫైల్)

కాకినాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ స్టోన్ బీచ్ వద్ద సముద్ర స్నానానికి దిగి గల్లంతైన యువకుడి దేహం లభ్యమైంది. వివరాల ప్రకారం.. గురువారం ఉదయం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన దుర్గాప్రసాద్, జంగారెడ్డిగూడెం మండలం ఏపోలవరానికి చెందిన కేతా మోహన్, జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన సముద్రాల పార్థు(17) కలిసి కాకినాడ బీచ్ సందర్శనకు పల్సర్ ద్విచక్ర వాహనంపై స్టోన్‌బీచ్‌కు చేరుకున్నారు. మోహన్ ఫొటోలు తీస్తుండగా దుర్గాప్రసాద్, పార్థు స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. పార్థు అనుకోకుండా అలలధాటికి కొట్టుకుపోయి సముద్రంలో గల్లంతుకాగా ఎంత ప్రయత్నించినా రక్షించలేకపోయారు. పోలీసుల గాలింపు చర్యల్లో భాగంగా శుక్రవారం ఉదయం యువకుడి దేహం లభ్యమైనట్టు తిమ్మాపురం ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు. నారపురెడ్డి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బీచ్ ఒడ్డున గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కాకినాడ రూరల్ పోలవరంలో గల జగన్మోహనపురం ఆర్చ్ ఎదురుగాగల బీచ్ ఒడ్డున గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు తిమ్మాపురం ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, ఎరుపురంగు కట్ బనియన్, నలుపురంగు డ్రాయర్ ఉన్నాయని, దానిపై అరుణ్‌గోల్డ్ ధూమ్ అనే అక్షరాలు ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే 9440796556 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

సత్యదేవుడి సన్నిధిలో
గెయిల్ అధికారుల పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం గెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ తదితరులు

అన్నవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం గెయిల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్‌కుమార్ గుప్తా, ఈడీ శాలిగ్రామ్ మావర్, జీఎం వై.ఎ కుమార్, షాకున్ గుప్తా తదితరులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానానికి వ్యర్థపునీటిని శుద్ధిచేసే సీవీపీ యంత్రం కావాలని కోరగా దానికి సంబంధించి లేఖను పంపిస్తే పరిశీలిస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు,ఈఈ రామకృష్ణ ఉన్నారు.

ఘనంగా చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్తేశ్వరాలయంలో చోరీ

అయినవిల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిలి మండలం ముక్తేశ్వరం శ్రీముక్తికాంత క్షణముక్తేశ్వరాలయంలో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఆలయం మూసివేసిన సమయంలో ఆలయానికి వేసిన తాళాలు బద్దలుకొట్టి దొంగలు చోరీ చేశారు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో క్లూస్‌టీమ్ కె.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలిముద్రలు సేకరించారు. రూ. 1.40లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకుపోయినట్టు తెలిపారు.



ఆలయంలో క్లూస్‌టీమ్ పరిశీలన

మహిళ ఆత్మహత్యాయత్నం
రక్షించిన సీఐ



మహిళను రక్షించిన పోలీసులు

ఆలమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గౌతమి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోయిన మహిళను రావులపాలెం సీఐ సీహెచ్.విద్యాసాగర్ రక్షించారు. బిక్కవోలు మండలానికి చెందిన పలివెల శైలజ (30) తన భర్త రాజుతో ఉన్న కలహాల కారణంగా శుక్రవారం జొన్నాడ వద్దకు చేరుకుని గౌతమి బ్రిడ్జిపై నుంచి దూకే ప్రయత్నం చేస్తుండగా అటుగా వెళ్తున్న రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ అడ్డుకున్నారు. ఆమెను ఆలమూరు పోలీసుస్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇప్పించి బంధువులకు అప్పగించారు.

2110 కిలోల బియ్యం స్వాధీనం



పోలీసులు సీజ్ చేసిన వ్యాన్

ఆలమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని ఆలమూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వచ్చి న సమాచారంతో తనిఖీలు నిర్వహించి వ్యాన్‌ను గుర్తిం చారు. దీనిలో 42 బస్తాల (2110కిలోల) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అశోక్ తెలిపారు. వీటి విలువ రూ.97వేలుగా గుర్తించినట్టు చెప్పారు. ఆలమూరు ఎంఎస్‌వో ఎస్ జి. పద్మ ఫిర్యాదు మేరకు వ్యాన్‌ను సీజ్ చేసి కర్రి రామారెడ్డి, విజ్జన సుదర్శన్‌రావు, కాకిలేటి ప్రవీణ్‌కుమార్, నిశ్చనకోళ్ల జీవన్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

గడ్డిమందు తాగిన యువకుడి మృతి

కాకినాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం పండూరులో బుధవారం సాయంత్రం 7గంటల ప్రాంతంలో కోటికుల రాజేష్ (29) ఆర్థిక ఇబ్బందులతో ఒత్తిడిని తట్టుకోలేక గడ్డిమందును తాగాడు. రాజేష్ గతంలో తన సోదరుడితో కలిసి కౌలుకు వ్యవసాయం చేసేవాడు. భారీ అప్పుల కారణంగా తమ ఇంటిని తాకట్టు పెట్టడంతో 4 నెలల క్రితం బ్యాంకు అధికారులు ఇంటిని స్వాధీనంచేసుకోవడంతో రాజేష్ మానసికంగా కుంగిపోయి గడ్డి మందు తాగాడు. కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్టు తిమ్మాపురం ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు. తండ్రి అప్పలకొండ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

తొండంగి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బుచ్చియ్యపేటకు చెందిన మడికి నాగ గోపి (39) మద్యానికి బానిసై బుధవారం గడ్డిమందు తాగాడు. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా శుక్రవారం మృతిచెందినట్టు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..

ఆటోను లారీ ఢీకొని ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు
- కృష్ణంపాలెం హైవేపై ఘటన



మరణించిన దుర్గ (ఫైల్)

దేవరపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి ఆటోలో వెళ్తున్నవారికి వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారి వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన చుక్కా బంగారయ్య, రమణమ్మ కుటుంబం విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి 11 మంది ఆటోలో బయలుదేరారు. ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె అంజలీ దుర్గ (17) డిగ్రీ చదువుతోంది. రాజమహేంద్రవరం సీతంపేట నుంచి వారు బయలుదేరగా కృష్ణంపాలెం జాతీయ రహదారిపై ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అంజలీ దుర్గను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఇదే ఘటనలో ఆటో డ్రైవర్ ఎన్.నరేష్, నెల్లి వీరబాబుకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



108లో క్షతగాత్రులు తరలిస్తున్న దృశ్యం

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య



మరణించిన సతీష్ (ఫైల్)

కొత్తపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన కొడుకు ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన తులా రాంబాబు కుమారుడు సతీష్(31) పనులకు వెళ్లి డబ్బులు ఇంట్లోకి తేకుండా మద్యానికి బానిసయ్యాడని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన సతీష్ స్నానం చేసేందుకు అని చెప్పి వాటర్ బకెట్, హీటర్ తీసుకుని వెళ్లి ఎంతసేపటికి బయటకు రాలేదు. రాంబాబు కంగారు పడి కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయిన్నట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



మృతిచెందిన పోసిబాబు



ఫైల్ ఫొటో

ఆత్రేయపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వేలిచేరుకు చెందిన తోట పోసిబాబు(32) శుక్రవారం సాయంత్రం వెలి చేరు-పులిదిండి సమీపంలో వ్యవసాయ పనులు చేస్తుండగా వ్యవసాయ మోటారు జీవైర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురికావడంతో పోసిబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోసిబాబు మృతి వార్త తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము పేర్కొన్నారు.

రెండో రోజుకు ఎరెవ్నా 4.0 సదస్సు

జీజీహెచ్(కాకినాడ) జూన్ 12 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎరెవ్నా 4.0 సదస్సు రెండోరోజు శుక్రవారం కూడా కొనసాగింది. ప్రధానంగా జీజీహెచ్‌లో 15 వర్క్‌షాపులు నిర్వహించారు. హ్యాండ్స్ ఆన్ సర్జరీ, బేసిక్ ట్రామా కేర్, ఆడిట్ టూ యాక్షన్, విజియో నెక్స్, డయోగ్నోస్టిక్ స్కిల్స్, బర్తింగ్ బ్రిలియన్స్, రేడియేషన్ ఆంకాలజీ తదితర అంశాలపై వర్క్‌షాపులు, పేపర్ ప్రెజెంటేషన్‌లు నిర్వహించారు. అనంతరం సాయంత్రం మెడికల్ డిబేట్ నిర్వహించారు. ఉదయం సెషన్‌లో ట్రజర్ హంట్ కార్యక్రమం ద్వారా వైద్య విజ్ఞానాన్ని పెంపొందించే యాక్టివిటీలు నిర్వహించారు. అలాగే సాయంత్రం రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో ఎరెవ్నా సదస్సుకు వివిధ వైద్య కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు సాంస్కృతిక ప్రదర్శనలు, పోటీలు నిర్వహించారు. శుక్రవారం మరో 50 మంది విద్యార్థులు రిజిస్టర్ అయ్యారు.

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



కారు ఢీకొని తల్లీకొడుకులకు గాయాలు

అమలాపురం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరూరు వై.జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం మోటారుసైకిల్‌పై ఇంటికి వస్తున్న తల్లీకొడుకులను వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. గాయపడ్డ వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన కందేరి మరియమ్మ, రాజులు అల్లవరం మండలం గూడాలలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఉదయం ఇంటికి తిరిగి వస్తుండగా పేరూరు వై.జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. గాయపడ్డ తల్లీకొడుకులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సీసీ కెమెరాలను పరిశీలించి అల్లవరం మండలం కోడూరుపాడుకు చెందిన వ్యక్తి కారుగా గుర్తించి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం..
చికిత్స పొందుతూ యువతి మృతి

భీమవరం క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు భీమవరం వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్రమానం గ్రామానికి చెందిన సంగాని రామలక్ష్మి తన ముగ్గురు పిల్లలతో భీమవరం తన తమ్ముడి ఇంటికి వచ్చింది. గతనెల 28న మొబైల్ ఫోన్ విషయంలో వాగ్వాదం జరగడంతో పెద్ద కుమార్తె అయిన సంగాని చందన ప్రియ(20)ను ఆమె తల్లి మందలించింది. మరుసటి రోజు 29న తెల్లవారుజామున రామలక్ష్మి తమ్ముడు ఇంటి బయట చూడగా ఆ యువతి షెడ్డులో ఇనుపరాడ్డుకు చీరతో ఉరివేసుకుని ఉండడం గమనించారు. వెంటనే కిందకు దించి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 12వ తేదీ సాయంత్రం యువతి మృతిచెందింది. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

సాక్షి ప్రతుల దహనం

కొమ్మినేనికి బెయిల్ రావడంపై తెలుగు మహిళల ఆగ్రహం



సాక్షి ప్రతులను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి మహిళలపై అసభ్యంగా మాట్లాడిన సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు న్యాయస్థానంలో బెయిల్ రావడంతో రాజమహేంద్రవరంలో తెలుగు మహిళలు ఆగ్రహించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక షెల్టాన్ సెంటర్‌లో తెలుగు మహిళా పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియల సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు నిరసన నిర్వహించారు. సాక్షి ప్రతులను దహనం చేశారు. సాక్షి లైవ్ కార్యక్రమంలో జర్నలిస్ట్ కృష్ణంరాజు అమరావతి మహిళను అసభ్యంగా మాట్లాడితే కొమ్మినేని అడ్డుకోలేదని, దానిని సాక్షి యాజమాన్యం కూడా ఖండించలేదన్నారు. బెయిల్‌పై విడుదలైన కొమ్మినేనిని ప్రజా ఉద్యమ పోరాట యోధుడిలా జగన్ స్వాగతించడం మహిళల పట్ల వారి నైజం మరోసారి బయట పడిందన్నారు. మహిళలను అగౌరవ పరిచిన సాక్షిని బ్యాన్ చేయాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కప్పల వెలుగుకుమారి, మీసాల నాగమణి, బోను ఈశ్వరి, లీలావతి, తుళ్లి పద్మ, దొంగ నాగమణి, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, కర్రం లక్ష్మీనాయుడు పాల్గొన్నారు.

జీజీయూలో ముగిసిన ఎన్ఐటీటీటీఆర్ శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రోవైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు

రాజానగరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో చెన్నైలోని జాతీయ సాంకేతిక విద్యా శిక్షణ, పరిశోధనా సంస్థ (ఎన్ఐటీటీటీఆర్)సౌజన్యంతో ఐదు రోజులుగా జీజీయూ ప్రాంగణంలోని కళాశాలల బోధన సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో జీజీయూ ప్రో వైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న కొత్త నైపుణ్యాలను తమ విధి నిర్వహణలో అవలంబించడం ద్వారా విద్యార్థులకు మరింత ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్లను జీజీయూ తరపున సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జీజీయూ రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, శిక్షణా తరగతుల కోఆర్డినేటర్ డి.రవికిషోర్, గైట్ ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ కేఎస్ గిరిధరన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.అనిల్‌కుమార్, డైరెక్టర్లు, డీన్లు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ చుట్టూ నేర చరిత్ర ఉన్న వారే!

టీడీపీ నాయకుడు రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ తన చుట్టూ నేర చరిత్ర ఉన్న వారినే తిప్పుకుంటున్నాడని టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భరత్‌రామ్ ప్రధాన అనుచరుడు, వైసీపీ సిటీ యువజన విభాగం అధ్యక్షుడు పీతా రామకృష్ణ, అతడి అనుచరుల అరాచకాలను వివరించారు. ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్‌గా పనిచేసిన దుంగ మంగను, చందా సత్యం చైర్మన్‌గా పని చేసిన రామశర్మను ఫోన్ చేసి బెదిరించడం, కోటిలింగాల ఘాట్‌లో జరిగిన హ్యాపీ సండే కార్యక్రమంలో డ్యాన్సు ప్రోగ్రాంను పాడు చేయడం వంటివి చేశారని, వీటిలో పాల్గొన్న ముగ్గురు ఒక హత్యకేసులో నిందితులుగా ఉన్నారని వివరించారు. తనను వేధిస్తున్న భరత్ అనుచరుడు చెల్లుబోయిన కృష్ణపై వైసీపీకి చెందిన సుశీల పోలీసు కేసు పెట్టగా కేసును ఉపసంహరించుకోవాలని ఆమెను భరత్ ఒత్తిడి చేశాడన్నారు. వాసిరెడ్డి బాబి మాట్లాడుతూ సత్యదేవ్ అనే యువకుడితో ప్రేమ పేరుతో మోసపోయిన యువతికి న్యాయం చేయాలని చూస్తుంటే దానిని రాజకీయం చేయాలని వైసీపీ నాయకులు చూస్తున్నారన్నారు. సమావేశంలో జనసేన నేత సత్యనారాయణ, టీడీపీ నాయకులు దాస్యం ప్రసాద్, పోలాకి పరమేష్, షేక్ బషీర్, శనపతి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



నర్సాపురంలో చెక్కు అందజేస్తున్న దృశ్యం

కోరుకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో అనారోగ్య కారణాలతో చికిత్సల అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అందజేశారు. కోరుకొండ, శ్రీరంగపట్నం, గాదరాడ, నర్సాపురం గ్రామాలకు చెందిన పలువురికి రూ.4,04,881 విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో అడ్డాల శివ, ముక్కా రాంబాబు, మట్టా నాగేశ్వరరావు, తెలగంశెట్టి శివ, చొంగా సూరిబాబు, పెదపాటి భీమరాజు, చీకట్ల శ్రీను పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఖైదీల తరపున ఉచితంగా వాదించడానికి న్యాయవాదుల అవసరత ఉన్నా, బెయిల్ పిటిషన్లు వేయడం, హైకోర్టులో అప్పీలు చేయడంతోపాటు మరే ఇతర న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తుందని సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె కేంద్ర కారాగారాన్ని, మహిళా ప్రత్యేక కారాగారాన్ని సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. ఆహార నాణ్యతా ప్రమాణాలను గమనించారు. ఖైదీలకు సంబంధించి ఎలాంటి న్యాయపరమైన సహాయం అవసరమైనా తమను సంప్రదించాలని ఖైదీల కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ జైళ్లలో ఇప్పటికే పారా లీగల్ వలంటీర్లను నియమించామని, వారి ద్వారా కూడా అర్జీలను అందజేయవచ్చన్నారు. ఖైదీలకు న్యాయ సహాయం కోసం పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలు వినియోగించుకోవాలని కార్యదర్శి శ్రీలక్ష్మి సూచించారు.

కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి సహకరించండి

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడితో భేటీలో ఎమ్మెల్యే బత్తుల



మంత్రి అచ్చెన్నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గ రైతులు తమ పంటలను నిల్వ చేసుకునేందుకు కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు. అమరావతి పర్యటనలో భాగంగా మంగళగిరిలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడుతో ఆయన శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పండ్ల మార్కెట్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని, స్థానిక రైతులు, టోకు వ్యాపారుల సౌకర్యార్థం నియోజకవర్గంలో పండ్ల మార్కెట్, కూరగాయల మార్కెట్ మంజూరు చేయాలన్నారు. 2024 వరదల్లో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం విడుదల చేయాలని, రాజానగరంలో వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు సొంత భవనం మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో అనుమతులు మంజూరు చేసి నిర్మాణాలకు మంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు.

నిఘా నీడన ధవళేశ్వరం

ధవళేశ్వరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణే లక్ష్యంగా ఎస్పీ ఆదేశాలతో నిర్మానుష ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని సీఐ టి.గణేష్ తెలిపారు. నిర్మానుష ప్రదేశాల్లో బహిరంగంగా మద్యం తాగడం, గ్యాబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలతో పాటు రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. క్రైం ప్రోన్ ఏరియాలపై డ్రోన్ ఎగురవేయడం ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, డెకాయిట్, రౌడీషీటర్లకు ప్రతి నెలా కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వారి సమాచారాన్ని 94407 96586 నెంబర్లో తెలియజేయాలని ప్రజలను కోరారు.

జోరుగా నారుమళ్లు

- కడియంలో 5 వేల ఎకరాల్లో తొలకరి పంటకు రైతులు సిద్ధం
- ఎంటీయూ 7029(స్వర్ణ), ఎంటీయూ 1318 సాగు



కడియం ఆవ ప్రాంతంలో వరి నారుమళ్లు

కడియం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దాళ్వా పంటను పండించారు. రైతులు ధాన్యాన్ని విక్రయించారు. అయితే వాతావరణం చల్లబడడం, మరో వైపు జూన్ మాసం రావడంతో రైతులు వరి నారుమళ్లు వేయడం ప్రారంభించారు. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం మండలంలో ప్రధానంగా కడియం ఆవ, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, మురమండ, దుళ్ల, వేమగిరి, కడియం వంటి గ్రామాల్లో 5 వేల ఎకరాల్లో రైతులు తొలకరి పంటకు సిద్ధం అవుతున్నట్లు అంచనా. మృగశిర కార్తె వచ్చిందంటే చల్లబడినట్లే అని అందుకే నారుమళ్ల వేయడం ప్రారంభించామని పలువురు రైతులు చెబుతున్నారు. నిన్నటి వరకు వాతావరణం వేడిగాల్పులు కారణంగా నారుమళ్లు అక్కడక్కడా వేశారని, ప్రస్తుతం వర్షం చినుకులు పడడం, వాతావరణం చల్లగా ఉండడం వంటి కారణాలతో నారుమడులు జోరుగా వేస్తున్నారు. ఈ పంటకు ఎంటీయూ 7029(స్వర్ణ) రకంతో పాటు, కడియం ఆవ వంటి ప్రాంతాల్లో పంట ముంపు సమస్యను తట్టుకునే విధంగా ఉన్న వరి రకం ఎంటీయూ 1318 రకం వరిసాగును చేసేందుకు రైతులు ఆ రకాల్ని నారుమళ్లు వేస్తున్నారు. అయితే విత్తనాలను సొసైటీలు, రైతుసేవా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నారు. 3 ఎకరాలకు సరిపడే విత్తనాలు రూ.1300 ధర చెల్లించి రైతులు తీసుకుంటున్నారు. కాగా ఎకరా వరి పొలానికి రైతు య.0-5 సెంట్ల నారుమడిని వేసుకోవాలి. ఇందుకు గాను కిలో విత్తనాలకు 3గ్రాముల కార్బండిజం మందు కానీ, 5 గ్రాముల మేంకోజెబ్ మందు కానీ కలిపి 24 గంటల పాటు మండికట్టుకోవాలి. ఇలా చేయడం ద్వారా పంటలో రోగ నిరోధకశక్తి పెరిగి తెగుళ్లు రాకుండా నిరోధించుకోవచ్చని వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాంధ్రలో నన్నయ వర్శిటీ వీసీ ప్రసన్నశ్రీ



ఆహార పదార్థాలను రుచి చూస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నన్నయ వర్శిటీ, శ్రీరాపర్తి రామా ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా సంయుక్తంగా మండలంలోని కానవరంలో సాత్విక్ ఆహార్ పేరుతో పౌష్టికాహారంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో కూజి పటా లియా బియ్యంతో అన్నం, కొర్రల పాయసం, అరికెల పులిహోర, పుల గం, గుత్తి వంకాయ కూర, మునగాకు కొబ్బరికాయ కూర, సామల పెరుగన్నంతో పాటు వివిధ రకాల పండ్లతో రుచికరమైన సాత్వికాహారం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శాఖాహారంలోని పౌష్టిక వంటలు, వాటి ప్రయోజనాలు, పోషకాలను వివరించారు. ప్రతిఒక్కరూ ఆహారపు అలవాట్లను మెరుగుపర్చుకుంటూ యోగ సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం కల్గుతుందన్నారు. అనంతరం వీసీ ప్రసన్నశ్రీను రాపర్తి రామా ఆశ్రమ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్శిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పందలపాక ఉన్నత పాఠశాలలో పీడీ యువరాజారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో పలు యోగాసనాలు వేయించారు. యోగాంధ్ర సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

19న ఆర్టీసీ అన్‌క్లైమ్డ్ పార్శిల్స్ బహిరంగ వేలం

అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పార్శిల్ ఆఫీసులోని అన్ క్లెయిమ్డ్/అన్ ఐడెంటి ఫైడ్ పార్శిల్స్ బహిరంగ వేలం ఈ నెల 19న నిర్వహించనున్నామని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం బస్‌స్టేషన్ ఆవరణలోని పార్శిల్ బుక్కింగ్ ఆఫీసు వద్ద ఉదయం 10:30 గంటలకు ఈ వేలం జరుగుతుందని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని ఆయన కోరారు.

విమాన ప్రమాదం అత్యంత బాధాకరం

బత్తుల నాగేశ్వరరావు

దివాన్‌చెరువు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం అత్యంత బాధాకరమని యాదవ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ విమాన ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. బాధిత కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చెరువుల వేలం వాయిదా

గోకవరం, జూన్13(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీయైన గోకవరంలో చేపల చెరువుల వేలం వాయిదా పడినట్లు పంచాయితీ కార్యదర్శి శిరీష శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే తక్కువ బిడ్లు రావడంతో వేలాన్ని ఈనెల 18వ తేదీకి వాయిదా వేశామన్నారు. 18న ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో పాల్గొనేవారు సాల్వెన్సీ సర్టిఫికెట్లు, దరావతు సొమ్ము పంచాయతీకి చెల్లించాలని సూచించారు.

విజన్-2047తో బంగారు భవిష్యత్

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనపర్తి నియోజకవర్గ వర్క్‌షాపు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భావి తరాలకు చక్కని మార్గాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు విజన్ 2047 రూపొందించారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి వర్క్‌షాపునకు ఆయన విచ్చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను అధిగమించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై మేధావి వర్గాలు సూచనలు సలహాలు అందజేయాలన్నారు. టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ అనపర్తి-పెడపర్తి, గొల్లలమామిడాడ-కాకినాడ రోడ్లు ట్రాఫిక్ సమస్యతో సతమతమౌతున్నాయని, వీటికి ప్రత్యామ్నాయ రోడ్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.అలాగే పౌల్ట్రీ రైతులను ఆదుకునేందుకు, అనపర్తిని రైస్‌మిల్లుల హబ్‌గా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా సీపీవో అప్పలకొండ, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాస్, పీఆర్ అచ్యుతరామారెడ్డి, స్మాల్ ఇండస్ట్రీస్ పీవో శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్తలు సబ్బెళ్ళ అమ్మిరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, రామలింగారెడ్డి, నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ తాడి రామగురెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలే లక్ష్యం

అనపర్తిలోని సాయి మాధవి డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత యువతలో ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసేందుకు నిర్వహిస్తున్న జాబ్ మేళాలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఈ మేళాకు సుమారు 400 మంది హాజరు కాగా 19 కంపెనీల నుంచి వచ్చిన ప్రతినిధులు 170మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మల్లిడి అనంతరెడ్డి, నాయకులు దత్తుడు శ్రీను, ఒంటిమి సూర్యప్రకాష్, మామిడిశెట్టి శ్రీను, ఎన్ఆర్‌కె ప్రసాదరెడ్డి, కర్రి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

విద్యా మిత్ర కిట్లు పంపిణీలో ఎమ్మెల్యే వాసు



విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీరిదిద్దే విధంగా విద్యావ్యవస్థలో సమూల మార్పులకు మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో అన్నపూర్ణంపేట సీనియర్ నేషన్ బేసిక్ స్కూల్, బీఎల్ పురం శ్యామలాంబ మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్లో జరిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సీట్ల కోసం తాము సిపార్సు లేఖలిచ్చే పరిస్థితి రెండు మూడేళ్లలో వస్తుందన్నారు. ఆ దిశగా మార్పులను మంత్రి లోకేశ్ తీసుకువస్తున్నారని చెప్పారు. గతంలో ప్రశ్నించడానికి భయపడే వారని అలాంటిదేవి లేకుండా ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, మజ్జి రాంబాబు, దాస్యం ప్రసాద్, పోలాకి పరమేష్, మాలే విజయలక్ష్మి పాల్గొన్నారు.

పంపు హౌస్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

సాయిబాబా గుడి వద్ద జరుగుతున్న నిర్మాణ పనుల పరిశీలనలో ఎమ్మెల్యే గోరంట్ల



పంపు హౌస్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మురుగునీటి పంపు హౌస్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక సాయిబాబా గుడి పక్కన ఆవా ఛానల్ వద్ద రూ.3.80 కోట్ల కార్పొరేషన్ నిధులతో నిర్మిస్తున్న పంపు హౌస్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. వర్షాలు మొదలవుతున్నాయని, పనులకు ఆటంకం లేకుండా పంపు హౌస్ బేస్‌మెంట్ రెండు రోజుల్లోపు పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. వరదల సమయంలో ఈ కాల్వ ద్వారా మురుగునీరు గోదావరిలో కలిసే అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లను మూసివేయడం వల్ల మురుగునీరు పారక దిగువ ప్రాంతాలు ముంపుకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది సంవత్సరాలుగా ఈ ఇబ్బందిని అధిగమించడానికి తాత్కాలికంగా పంపులు ఏర్పాటు చేసి ఎమ్మెల్యే చొరవతో నీటిని గోదావరిలోని తోడి పోస్తున్నారు. ముంపు ప్రాంతాలకు శాశ్వతంగా విముక్తి కలిగించేందుకు ధవళేశ్వరం వద్ద కాల్వ నీరు గోదావరిలో కలిసే చోట శాశ్వత పంపు హౌస్ నిర్మాణం చేపట్టారు. వరదలు వస్తే పనులకు ఆటంకం కలుగుతుందని దానిని దృష్టిలో పెట్టుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల ఆదేశించారు.

పోలీసుల తప్పు లేదు

పెళ్లి చేసుకుంటాను కేసు వద్దు అని యువతే చెప్పింది: డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేటకు చెందిన 19 ఏళ్ల యువతి విషయంలో పోలీసుల నిర్లక్ష్యం ఎంతమాత్రం లేదని డీఎస్పీ బి.విద్య పేర్కొన్నారు. బొమ్మూరు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. 19 ఏళ్ల యువతి, మోరంపూడికి చెందిన 27 ఏళ్ల పులపర్తి సత్యదేవ్ ప్రేమించుకున్నారని, ఈ క్రమంలో యువతి గర్భం దాల్చింది. తనను వివాహం చేసుకోవడానికి సత్యదేవ్ నిరాకరించాడని ఆమె కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఉమెన్ అండ్ చైల్డ్ సెల్ ద్వారా బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తే ఇద్దరినీ పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. అయితే వివాహానికి నిరాకరించిన సత్యదేవ్ పది రోజులు గడువు అడిగాడని తెలిపారు. యువతి కూడా తనకు సత్యదేవ్‌తో వివాహం చేయాలని అతడిపై కేసులు పెడితే నా లైఫ్ పోతుందని రాతపూర్వకంగా రాసి ఇవ్వడంతో మానవతా దృక్పథంతో గడువు ఇచ్చామన్నారు. అంతే తప్ప ఈ ఘటనలో పోలీసుల తప్పు లేదన్నారు. కాని ఆ యువతి ప్రెస్‌మీట్ పెట్టి తనను పట్టించుకోలేదని పోలీసులపై బురద జల్లడం సరికాదన్నారు. బాధిత యువతి శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో సత్యదేవ్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రాజేంద్రనగర్ కు చెందిన ఎస్.దుర్గాప్రసాద్ అనే 38 ఏళ్ల వ్యక్తి కనిపిచండం లేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. దుర్గాప్రసాద్ మునిసిపాలిటి వాహనంలో తాత్కాలిక డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను గతంలో ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చాడు. ఈ తరుణంలోనే ఈ ఏడాది ఫిబ్రవరి 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలో లాగే తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు ఎదురు చూశారు. ఎంతకీ రాకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు దుర్గాప్రసాద్ భార్య దుర్గా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మాక్‌డ్రిల్‌లో భాగస్వాములవ్వాలి

గోపాలపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శనివారం నిర్వహిచతలపెట్టిన యోగాంధ్ర మాక్‌డ్రిల్‌లో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని స్పెషల్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మాక్‌డ్రిల్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో 2కోట్ల మందిని భాగ స్వాములను చేసేందుకు ప్రభుత్వం నెలరో జులు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.

తల్లి కళ్లలో ఆనందం

చదువుకునే పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం తల్లి వందనం పథకం అమలు చేసింది. దీనిలో భాగంగా శుక్రవారం పలువురు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసింది. తమ ఖాతాల్లో నగదు జమ అయిన పలువురు తల్లులు హర్షం వ్యక్తం చేశారు.

బ్యాంకులో రూ. 39 వేలు పడ్డాయి



రాజమహేంద్రవరం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తన ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం వచ్చిందని రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ ఏ-బ్లాక్‌కు చెందిన కంద లత తెలిపారు. తన కుమారులు చైతన్య 7వ, భరత్‌వర్ధన్ 4వ, ఆకాశ్‌దీప్ 3వ తరగతి చదువుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చినమాట ప్రకారం ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు ఇవ్వడం సంతోషంగా ఉందని లత అన్నారు.

మా ముగ్గురు పిల్లలకు వచ్చింది



కడియం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మాది కడియం గ్రామం మేకలదిబ్బ.. నా పేరు కలవల వెంకటలక్ష్మి. నా భర్త రవి కూలిపనులు చేసుకుంటూ వచ్చే జీవనం సాగిస్తుంటాం.. మాకు ముగ్గురు పిల్లలు... కృప 8వ తరగతి, మోషే 7వ తరగతి, స్వరూప 5వ తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వంలో ఒకరికి మాత్రమే అమ్మఒడి ఇచ్చేవారు. తల్లికి వందనం పథకంలో ముగ్గురికీ రూ. 39 వేలు మా బ్యాంకు ఖాతాకు జమ అయ్యాయి. చాలా సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు మా కృతజ్ఞతలు...

చాలా సంతోషంగా ఉంది



కడియం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మాది కడియపులంక పంచాయతీలోని బుర్రిలంక గ్రామం... నా పేరు గుండుబోయిన విజయ మాధురి.. నా భర్త రాంబాబు నర్సరీ పనులు చేస్తుంటారు. మా కుమార్తెలు.. శ్రీనిధి 6వ, మోక్షన్యశ్రీ 5వ, తేజస్విని 3వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకంలో ముగ్గురు పిల్లలకు రూ.13,000 చొప్పున రూ. 39 వేలు మా బ్యాంకు ఖాతాకు జమ అయ్యాయి. చాలా సంతోషంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమంది పిల్లల చదువుకు తల్లికి వందనం పథకం ఇస్తాం అని ఇచ్చిన మాట ప్రకారం మా ముగ్గురు పిల్లల చదువుకు రూ. 39వేలు ఇచ్చారు.





కాకినాడలో జాబితా తనిఖీ

అమ్మలకు.. ఆనందం!



చంద్రన్నకు తల్లుల వందనాలు

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ- ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు.. అమ్మల కళ్లల్లో ఆనందం చూశారు. 'తల్లికి వందనం' డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ కావడం శుక్రవారం నుంచి ఆరంభమైంది. గురువారం జమ అవుతాయని చెప్పినా అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం రూపంలో అనుకోని విపత్తు సంభవించడంతో ఒకరోజు ఆలస్యమైంది. చంద్రబాబు చెప్పిన విధంగానే ఎందరు పిల్లలు (విద్యార్థులు) అంతమందికీ ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఒకటో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది అడ్మిషన్లు జరుగుతున్న కారణంగా వారికి తర్వాత ఇస్తారు. ఇప్పుడు రెండో తరగతి నుంచి పది, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు సంబ oధించి వారి తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికీ రూ.13 వేలు చొప్పున జమవుతున్నాయి. రూ.2 వేలను పాఠశాల నిర్వహణ నిమిత్తం మినహాయిస్తున్నారు. ఇద్దరు పిల్లలుంటే రూ.26 వేలు.. ముగ్గురు పిల్లలుంటే రూ.39 వేలు ఖాతాల్లో జమ చేశారు. ఆ మెసేజ్‌సెల్‌కి రావడంతోనే కుటుంబం ఎగిరి గంతేసినంత పనిచేస్తోంది.

5.80 లక్షల మంది విద్యార్థులు

ఉమ్మడి తూర్పుగోదావరిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 5.80 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానం కావడంతో ఒకేసారి అంత మొత్తాన్ని ఆయా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తే సాంకేతిక ఇబ్బం దులు తలెత్తుతాయి. సర్వర్లు మొరాయిస్తాయి. అందువల్ల అర్హులైన ప్రతి ఒక్కరి ఖాతాల్లో గంటల తేడాతో సొమ్ము జమవుతోంది. ఈ ప్రక్రియ వచ్చే నెల 5 వరకూ కొనసాగనుంది. తూర్పు గోదావరి జిల్లాలో 1,88,226 మంది విద్యార్థులకు సంబంధించి 1,23,779 మంది తల్లుల ఖాతాల్లో సుమారు రూ.240 కోట్లు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,70869 మంది పిల్లలకు సంబంధించి 1,12,419 మంది తల్లుల ఖాతాల్లో రూ.250 కోట్లు, కాకినాడ జిల్లాలో 2,28,780 మంది విద్యార్థులకు సంబంధించి 1,49,400 మంది తల్లుల ఖాతాల్లో రూ.340 కోట్లు జమ కానున్నాయి.

సచివాలయాల వద్ద క్యూ

సచివాలయాల వద్దకు ప్రజలు పదుల సంఖ్యలో చేరుకుని అర్హత జాబితాలను పరిశీలించుకునే పనిలో బిజీబిజీగా ఉన్నారు. కొందరు అనర్హుల జాబితాలో ఉండడంతో కారణాల అన్వేషణలో పడ్డారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అత్యధికులు విద్యుత్ బిల్లుల షాక్ వల్ల అనర్హుల జాబితాలోకి వెళ్లిపోయారు. ఏడాదిని యావరేజ్ చేసి విద్యుత్ బిల్లులు నిర్ధారించడంతో ఈసారి ఎక్కువ మంది లబ్ధిదారులు అర్హత సాధించకుండాపోయారు. పి.గన్నవరం మండలం లంకలగన్నవరం గ్రామానికి చెందిన 178 మందికి విద్యుత్ బిల్లుల షాక్ కారణంగా అనర్హులుగా పరిగణించబడ్డారు. వీరంతా గన్నవరంలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి వచ్చి ఏడాదిని యావరేజ్ చేయించుకుని విద్యుత్‌శాఖ నుంచి సర్టిఫికెట్లు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరో వైపు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలకు కొందరు చేరుకుని తమ పేరున



తల్లికి వందనం నగదు జమ సందర్భంగా కాకినాడ పెగోడా స్కూల్‌లో సీఎం చిత్రపటానికి పాలభిషేకం

- మాట నెరవేర్చిన ప్రభుత్వం
- తల్లుల ఖాతాల్లో నగదు జమ
- ఉదయం నుంచి ఫోన్లకు మెసేజ్‌లు
- సచివాలయాల్లో అర్హుల జాబితా
- ఎగిరి గంతేసిన అర్హులు
- 20 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న మరో జాబితా ప్రదర్శన
- 30న ఒకటి, ఇంటర్ విద్యార్థులకు

నాలుగు చక్రాల వాహనాలు ఉండడం వల్ల అనర్హత జాబితాలో ఉన్నామని.. తమకు ఏమీ లేవని క్లియరెన్స్ సర్టిఫికెట్లు కావాలంటూ కార్యాలయాల చుట్టూ తిరగడం ప్రారంభించారు. ఒక చోట మ్యాపింగ్ పూర్తయిన తర్వాత మరో చోటకు ఇల్లు మారిన వారు అయోమయానికి గురవుతన్నారు. తాము ప్రస్తుతం నివాసం ఉంటున్న పరిధిలోని సచివాలయంలో పిల్లల పేర్లు లేకపోవడం, ఎక్కడ జాబితాలో ఉన్నాయో తెలియకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శించారన్న సమాచారం ఇప్పుడిప్పుడే గ్రామాల్లో ప్రజలకు చేరుతుంది. రెండో శనివారం సెలవు, ఆదివారం సెలవు దినాలు కావడంతో లబ్ధిదారులు మళ్లీ సోమవారం వరకు తమ భవిష్యత్తును పరీక్షించుకునేందుకు రెండు రోజులపాటు వేచి చూడాల్సిందే. నిధులు పొందిన వారిలో ఆనందం కనిపిస్తుంటే, అనర్హుల్లో మాత్రం ఆవేదన వ్యక్తమవుతోంది.

నగదు జమకాకపోయినా కంగారుపడొద్దు!

సచివాలయాల్లో శుక్రవారం నుంచి అర్హులు, అనర్హుల జాబితా ఉంచారు. అభ్యంతరాలు, వినతులు ఈనెల 20వ తేదీలోపుగా ఆయా సచివాలయాల ద్వారా సమర్పించాలి. మరొక అర్హుల జాబితా 28వ తేదీలోపుగా రూపొందిస్తారు. ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు సంబంధించి ఈనెల 30న జాబితాలు ప్రదర్శిస్తారు. మొత్తం తల్లికి వందనం నగదు జమ ప్రక్రియ వచ్చే నెల 5వ తేదీతో పూర్తి చేస్తారు. అర్హుల జాబితాలో ఉంటే సొమ్ము ఖచ్చితంగా జమవుతుందని అధికారులు చెబుతున్నారు. అనర్హత జాబితాలో ఉన్నవారు నిరాశకు గురైనా గ్రీవెన్స్‌కి సమయం ఉందని సూచిస్తున్నారు. ఇప్పుడు ప్రకటించినది మొదటి లిస్టు.. సమస్యల పరిష్కారం తర్వాత రెండో లిస్టు ప్రకటిస్తారని చెబుతున్నారు. ఆధార్ తదితర సమస్యలు ఉంటే సరిచేసుకోవాలంటూ ఇప్పటికే ఆయా పాఠశాలలకు జాబితాలు వెళ్లాయి. దీంతో పాఠశాలల సిబ్బంది తల్లులకు సమాచారం ఇస్తున్నారు. ప్రతి తల్లి లేదా సంరక్షకుడు ఆధార్ సీడింగ్ పూర్తి చేసుకున్న బ్యాంకు ఖాతాకే డబ్బులు జమవుతాయి. సింగిల్ పేరెంట్ తండ్రి ఉంటే అతని ఖాతాకు డబ్బులు వెళతాయి.అనాథ పిల్లల నగదును కలెక్టర్ల ఖాతాల్లో జమ చేసి పరిశీలన అనంతరం అందజేస్తారు. ఇప్పటికే అర్హులకు సంబంధించిన నగదును బ్యాంకులకు ప్రభుత్వం పంపించింది.



నలుగురికి రూ.52 వేలు..

సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు. మాది పెరవలి మండలం కానూరు అగ్రహారం.. మాకు నలుగురు పిల్లలు.. రూ.52 వేలు మా అకౌంట్‌లో పడ్డాయి. ఒకేసారి ఇంత పెద్ద మొత్తం మా అకౌంట్‌లో పడడం తొలిసారి. చాలా ఆనందంగా ఉంది. గతంలో కేవలం ఒక్కరికి మాత్రమే వచ్చేవి.

- ఎం.శివయ్య, ధనలక్ష్మి, కానూరు, పెరవలి



ఆధార్ లింకైతే నలుగురికి...

మాకు నలుగురు పిల్లలు. సాకుర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. గతంలో అమలాపురంలో ఉండేవాళ్లం. రేషన్‌కార్డు అక్కడే ఉంది.బ్యాంకుఖాతాకు ఆధార్ అనుసంధానం కాలేదు.దీంతో నిలిచిపోయింది. అనుసంధానమైతే తల్లికి వందనం వస్తుందని విద్యాశాఖాధికారులు తెలిపారు.

- జి.శ్రీనివాసరావు,శాంతికుమారి, సాకుర్రు



అమ్మ లేకున్నా.. నానమ్మకు..

తల్లి లేని ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు జమైంది. ఆనందంగా ఉంది. మా అబ్బాయి దిమ్మిలి దేవదాసు వ్యవసాయ కూలీ. కొంత కాలం కిందట అతని భార్య చనిపోయింది. దీంతో ముగ్గురు పిల్లల సంరక్షణ నేనే చూస్తున్నా.ఇచ్చిన మాటకు కట్టుబడి సొమ్ములు వేసిన కూటమి ప్రభుత్వానికి ఇదే మా వందనం.

- నాయనమ్మ సుబ్బలక్ష్మి, చిన్నారులు

ఎస్సీ విద్యార్థులకు జమకాలేదు..

రాజమహేంద్రవరం అర్బన్/ కాకినాడ కార్పొరేషన్, జూన్13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థినీ.. విద్యార్థులకు తల్లికి వందన పథకంలో డబ్బులు వారి బ్యాంకు అకౌంట్‌కు జమ కాలేదని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఎంఎస్ శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో 2,660 మంది, కాకినాడ జిల్లాలో 2367 మందికి సొమ్ములు జమ కాలేదని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 8, 9 తరగతులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు 557 మంది తల్లుల అకౌంట్‌కు ఇంకా డబ్బులు జమ కాలేదన్నారు. అదే విధంగా కాకినాడ జిల్లాలో 9,10 తరగతి చదువుతున్న విద్యార్థులు 500 మందికి వారి తల్లుల ఖాతాల్లో జమ కావాల్సి ఉందన్నారు. తల్లికి వందనం డబ్బులు జమకాని తల్లిదండ్రులు కంగారుపడాల్సిన అవసరం లేదన్నారు. వెంటనే దగ్గరలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. ముందుగా సమస్య ఏమిటనేది తెలుసుకోవాలన్నారు. అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు చేపడితే రెండో విడతలో వస్తుందన్నారు.అర్హుల జాబితాలో ఉండి సొమ్ములు పడకపోయినా ఇబ్బందిలేదన్నారు.



నేడు సచివాలయాల్లో ప్రత్యేక మేళా

సచివాలయాల్లో శనివారం ఉదయం 11 గంటలకు మేళా నిర్వహిస్తున్నారు. సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/ వార్డు ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని సంప్రదించాలి. అర్హుల జాబితాలో ఉన్నా సొమ్ము పడక పోవడానికి ప్రధాన కారణం.. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)లో ఆధార్‌ను అనుసంధానం చేసుకోకపోవడమే.బ్యాంకు అకౌంట్ ఉన్న వారు ఎన్‌పీసీఐకి ఆధార్ అనుసంధానం చేసుకుంటే ప్రభుత్వ పథకాలకు సం బంధించిన సొమ్ములు జమవుతాయి.అయితే కాస్త సమయం పడుతుందని సమాచారం. తల్లికి వందనం పథకంలో ఆర్థిక సహాయం పొందడానికి పోస్టాఫీసులో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)లో అకౌంట్ ఓపెన్ చేసుకుంటే నగదు జమవుతుందని చెబుతున్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేసుకోవడంతోపాటు ఎన్‌పీసీఐలో ఆధార్ అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది.

మా పిల్లల చదువుకు వినియోగిస్తాం..



నా ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు జమయ్యాయి. ఆనందంగా ఉంది. మాది బిక్కవోలు మండలం రంగాపురం..శుక్రవారం ఉదయం మెసేజ్ వచ్చింది.. ఏమిటా అని చూస్తే రూ.39 వేలు జమయ్యాయి. సొమ్ము బ్యాంకులోనే ఉంచి మా పిల్లల చదువుకు వినియోగిస్తాం.

- తనుబోయిన అనూష, వెంకటరమణ, బిక్కవోలు

ముగ్గురికి రూ.39 వేలు పడ్డాయి..



చంద్రబాబు చెబితే చేస్తారని తెలుసు.. బాబును నమ్మాం.. బాగుపడుతున్నాం.. మాది కడియం మండలం దుళ్ళ.. నా పేరు తొట్టా స్వాతి. నా భర్త సత్తిబాబు ఆటో డ్రైవరు.. మాకు ముగ్గురు అమ్మాయిలు...నా ఖాతాలో రూ.39 వేలు జమయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

- తొట్టా స్వాతి, సత్తిబాబు, దుళ్ళ, కడియం మండలం

అన్నమాట నిలబెట్టుకున్నారు...



పాఠశాలల ప్రారంభం మరుసటి రోజునే తల్లికి వందనం వేయడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని, అన్నమాట నిలబెట్టుకున్నారు. మా ముగ్గురు కుమార్తెలకు రూ.39 వేలు పడ్డాయి.

- ఎస్.శ్రీనివాసరావు, త్రిలోకసుందరి, గంగలకుర్రు (పెదపాలెం)

చంద్రన్నకు వందనం



మాకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి.. శుక్రవారం ముగ్గురికి అమ్మకు వందనం సొమ్ము జమైంది. దీంతో మా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది. గత ప్రభుత్వంలో మణికంఠకు మాత్రమే ఇచ్చారు.

- ఉప్పు నాగరాజు,నాగమహాలక్ష్మి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం

రూ.39 వేలు..చదువులకే ఖర్చు చేస్తాం..



మాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురు బంగారు తల్లులే. శుక్రవారం రూ.39 వేలు పడ్డాయి. ఎంతో ఆనందం కలిగింది. గతంలో ఒకరికే పడేది.. ఇప్పుడు ముగురికి డబ్బులు పడ్డాయి. వారి చదువుకే ఖర్చు చేస్తా.

- త్రినాథుల శివశంకర్, మల్లిక దంపతులు, దుర్గాడ

ఇది మంచి ప్రభుత్వం



ఇది మంచి ప్రభుత్వం.. అందుకే ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. మాది కొవ్వూరు మండలం పెనకనమెట్ట..మాకు ముగ్గురు పిల్లలు. తల్లికి వందనం పథకంలో భాగంగా శుక్రవారం రూ. 39 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేయడం ఆనందంగా ఉంది.

- ఇంటి శ్రీను, శ్రావణి, పెనకనమెట్ట, కొవ్వూరు మండలం

కోకో గింజల కొనుగోలుకు

ప్రభుత్వం సిద్ధం

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వాస్తవ రైతుల నుంచే కోకో గింజలు సేకరణకు తహశీల్దార్,ఉద్యాన అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెలాఖరులోపు వాస్తవ సాగుదారులు నుంచి కోకో దిగుబడులను పూర్తి సేకరిస్తామన్నారు. కిలో రూ.500 చొప్పున రైతుకు ధర చెల్లిస్తే ప్రభుత్వం రూ.50 చొప్పున కంపెనీలకు రీయింబర్స్ చేస్తుందన్నారు. మిగిలిన సరుకు ఈ నెల 30వ తేదీలోగా సేకరించాలని అధికారులకీ లక్ష్యం నిర్ధేశించామన్నారు. కోకో రైతుల నుంచి వినతులు స్వీకరించడం కోసం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. సోమవారం నుంచి అందుబాటులో ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినతులు స్వీకరిస్తారన్నారు.ఈ మేరకు కంట్రోల్ రూమ్ 79953 67797 నెంబరు ఏర్పాటు చేశామన్నారు.



గోదావరి రివర్ ఫ్రంట్ మారనుందిలా..

గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుందీ!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం మారబోతోంది. మరింత సుందరంగా కనిపిం చబోతోంది. నగరానికి మరో ఆహ్లాదం. మరో మోదం గోదావరి రివర్ ఫ్రంట్.రోడ్డు పార్కు కలిసి వస్తుంది.హైదరాబాద్ ట్యాంక్ బండ్.. వైజా గ్ బీచ్ రోడ్డును తలపించేలా.. గోదావరి రివర్ ఫ్రంట్ మారబోతోంది. గోదావరి నీటి గలగలలు, చల్లటి గాలి, నీటి ప్రవాహం ఒయ్యారం చూస్తూ రివర్ ఫ్రంట్‌లో కూర్చుంటే తనివి తీరా ఆహ్లాదమే. ఇక్కడ అధికారులు రూపొందించిన డిజైన్లు చూడముచ్చటగా ఉన్నాయి. పివి నరసింహారావు పార్కు నుంచి గౌతమి నందనవనం వరకూ 550 మీటర్ల పొడవున ఈ రివర్ ఫ్రంట్ నిర్మించనున్నారు.దీనికి మొత్తం రూ.22 కోట్ల వ్యయ అంచనా వేశారు. దీనిని అప్పర్, లోయర్ విభాగాలుగా విభజించారు. మొదటి ప్యాకేజీని రూ.14 కోట్లతో చేస్తు న్నారు.అందులో పద్మావతి ఘాట్ వద్ద బ్రిడ్జి, రివర్ ఫ్రంట్ భాగం నిర్మిస్తారు. ఇక్కడ గ్రీనరీ, సీటర్స్, లైటింగ్, ప్లాజా ప్లేసెస్ (కూర్చో వడానికి వీలుగా),రోడ్డు వైపు ఓపెన్‌గా ఉండేటట్టు నిర్మించనున్నారు. పద్మావతి ఘాట్ వద్ద గ్యాప్‌లో 83 మీటర్ల బ్రిడ్జిని నిర్మిస్తారు. నదిలో 35 అడుగుల లోతులో పైల్ ఫౌండేషన్ వేస్తున్నారు. ప్రస్తుతం బ్రిడ్జి టెస్ట్ పైల్ నిర్మిస్తున్నారు. దీనిని 9 నెలలో పూర్తి చేయాల్సి ఉంది. కానీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆరు నెలలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇక్కడ పిండ ప్రదానాల రేవు, ప్రము ఖల విగ్రహాల విషయమై అఖిలపక్షంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఇప్ప టికే చర్చించిన సంగతి తెలిసిందే. రివర్ వైపు లోయర్ ప్రాంతంలో మిగతా సొమ్ముతో పనులు చేయనున్నారు. ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ డిజైన్లను రూపొందిస్తుంది.త్వరలో టెండర్లు పిలవనున్నారు.

చినుకు పడుతున్నా..చిరు ఆశ

ఆరుగాలం పండిస్తారు..అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడతారు.. చాలా మంది మామిడి రైతులు దళారీలను తట్టుకోలేక సొంతంగా అమ్ముకునేందుకే ఇష్టపడతారు..ఎందుకంటే డబ్బులు కనిపిస్తాయని ఆశ..ఎన్ని కష్టాలొచ్చినా ఆ ఆశ వీడరు.. రాజమండ్రిలో శుక్రవారం కెమెరాకు చిక్కిన ఈ చిత్రమే నిదర్శనం.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





హుకుంపేటలో విచారణ నిర్వహిస్తున్న డీఏవో, డీఎల్‌పీవో (ఫైల్)

విచారణ హుళక్కేనా!

- డీఏవో బదిలీపై భిన్నవాదనలు
- పంచాయతీలపై విచారణ ఎలా

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో 2019-24 సంవత్సరాల మధ్యకాలంలో బిల్డింగ్ ఫీజులు, ఆస్తి పన్నులు జమచేయడంలో పంచాయతీ అధికారులు భారీ మొత్తంలో అవకతవకలకు పాల్పడినట్టు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి ముగ్గురు అధికారులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపట్టి వారం రోజుల్లో నివేదిక అందజేయాలని నివేదికలో పేర్కొన్నారు. విచారణాధికారులుగా జిల్లా ఆడిట్ అధికారి ఆర్.పద్మజారాణి, డీఎల్‌పీవో నాగలత, రూరల్ ఇన్‌చార్జి తహశీల్దార్ శ్రీనివాసరావు లను నియమించారు. దీనిపై ఈ నెల 6వ తేదీన హుకుంపేట పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. జిల్లా ఆడిట్ అధికారి పద్మజారాణి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో (గత నాలుగేళ్లకు సంబంధించి) బిల్డింగ్ ఫీజుల వివరాలతో పాటు గతేడాదికి సంబంధించి రీఆడిట్ నిర్వహించి జిల్లా కలెక్టరు ఆదేశాల ప్రకారం వారం రోజుల్లో నివేదిక సమర్పిస్తామని తెలిపారు. అక్కడ వరకు బాగానే ఉంది.అయితే విచారణ పూర్తి కాకుండనే జిల్లా ఆడిట్ అధికారి (డీఏవో) పద్మజారాణిని పక్కన పెట్టి ఆ అధికారి కంటే జూనియర్‌గా ఉన్న మరొక అధికారి సుబ్బా రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఆర్‌జేడీ కల్యాణి 10వ తేదీన ఉత్తర్వులు జారీ చేశా రు.ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్టు సమాచారం. విచారణ నివేదికలు బయటకు వస్తే గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పాటు పంచాయతీరాజ్‌కు సంబంధించి మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారుల జాతకాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే విచారణాధికారి మార్పునకు ప్రధాన కారణమని పలువురు విమర్శిస్తున్నారు. హుకుంపేట పంచాయతీ పరిధిలో లక్షలాది రూపాయల బిల్డింగ్ ఫీజులు పంచాయతీ ఖాతాకు జమ చేయకుండా పక్క దోవ పట్టినట్టు తెలుస్తుంది. కోలమూరు పం చాయతీలో కూడా అవకతవకలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ పంచాయతీ పరిధిలో బిల్డింగ్ ఫీజులకు సంబంధించి సుమారు రూ.75 లక్షల మేర నిధులు దుర్వినియోగమైనట్టు వినికిడి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై ప్రస్తుత గ్రామ కార్యదర్శి తరచు విజి లెన్స్ అధికారుల ముందు హాజరవుతుండడం విశేషం.

'ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు జమ

నిడదవోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యార్థుల తల్లితండ్రులకు అందిస్తున్న తల్లికి వందనం పథకం డబ్బులు రూ. 13 వేలు చొప్పున వారివారి ఖాతాల్లో శుక్రవారం నుంచి జమవుతున్నాయి. పట్టణంలోని రాయిపేట సచివాలయం పరిధిలో మొత్తం 505 మంది లబ్ధిదారులు ఉండగా, 383 మంది అర్హత సాధించారు.

విద్యకు అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే



చాగల్లు హైస్కూల్లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

చాగల్లు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా పని చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంజూరైన విద్యామిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం, బెల్టు, పుస్తకాలు, వర్క్‌బుక్స్, బ్యాగ్, బూట్లు, సాక్సులు, డిక్షనరీతో కూడిన కిట్లను అందజేశారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కూటమి నాయకులు కరుటూరి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్థిక అసమానతలపై ఎమ్మార్పీఎస్ పోరాటం'



రాజేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొవ్వూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోని సామాజిక, ఆర్థిక అసమానతలపై ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కమిటీల జిల్లా ఇన్‌చార్జి బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ అన్నారు. పట్టణంలోని మెరకవీధిలో శుక్రవారం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం ముప్పిడి డానియేల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ జూన్ 6వ తేదీ నుంచి జూలై 6 వరకు గ్రామస్థాయి నుంచి ఉద్యమం బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్, కె. బాబీ, పి. నాగేంద్ర, జి. వెంకటేష్, శివప్రసాద్, రవికుమార్, వేణు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ఇన్సులిన్ సిరంజీలు అందజేత



డాక్టర్‌కు ఇన్సులిన్ సిరంజీ బాక్సులు అందిస్తున్న జనసేన నాయకులు

నల్లజర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఇన్సులిన్ సిరంజీల కొరత ఉందని తెలియడంతో నల్లజర్లకు చెందిన జనసేన పార్టీ నియోజకవర్గ ఐటీ కో-ఆర్డినేటర్ ఉన్నమట్ల సత్యకిరణ్ ఆధ్వర్యంలో వాటిని శుక్రవారం అందించారు. ఇక్కడ ప్రధానంగా కుక్క, పాము, కోతికాటు వంటి వాటికి వ్యాక్సిన్లు వేసేందుకు ఇన్సులిన్ సిరంజీలు లేవని వైద్యసిబ్బంది తెలియ జేడంతో జనసేన నైతలైన గుండు మోగుల సోమేశ్వరరావు, తాటికొండ కేదారేశ్వరరావు, ఆచ్చుల ప్రసాద్, ఉన్నమట్ల సాయి గంగాధర్, కోడూరు తరుణ్ కలిపి రూ. 10వేల విలువ చేసే 10 ఇన్సులిన్ సిరంజీల బాక్సులను డాక్టర్ గంగాధర్‌కు అందించారు. కార్యక్ర మంలో డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్, సీహెచ్‌వో నేమాని వెంకటశాస్త్రి, వైద్య ఉద్యోగుల సంఘం నేత జీవీవీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం అందజేత



బాధితురాలికి సాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కొవ్వూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితురాలికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేసినట్టు ఆ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ తెలిపారు. చిడిపిలో పాలడుగుల గీతిక పుట్టినరోజును పురస్కరించుకుని క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు క్లబ్ సభ్యులు వైద్యఖర్చుల నిమిత్తం రూ. ఐదువేల ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, మద్దిపాటి సత్యనారాయణ చేతులమీదుగా అందజేశారు. అలాగే వివిధ పాఠశాలల్లో చదువుతున్న 100 మంది విద్యార్థులకు 500 నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటమణి రామకిషోర్, పెనుమాక జయరాజు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, కలగర ఏడుకొండలు, ఉప్పులూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో యోగాపై అవగాహన



నిడదవోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా చేస్తున్న అధ్యాపకులు

నిడదవోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరి జీవితంలోను యోగా ఒక భాగం కావాలని ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ బి.మేరీ సుజాత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం మే 21వ తేదీ నుంచి జూన్ 21 వరకు నిర్వహిస్తున్న యోగాంధ్ర ద్వారా యోగాలో పాల్గొనే విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బీ.ఏసురత్నం, అధ్యాపకులు వెంకటరమణ, కుమారస్వామి, మురళి, సతీష్‌బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరు పట్టణంలో

యోగాంధ్ర - 25 రాష్ట్ర స్థాయి సాధన

● ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆర్డీవో రాణీసుస్మిత, తదితర అధికారులు



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో యోగాంధ్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శనివారం ఉదయం జరిగే యోగాంధ్ర 2025 రాష్ట్ర స్థాయి సాధనను విజయవంతం చేయాలని ఆర్డీవో రాణీసుస్మిత కోరారు. శుక్రవారం వివిధశాఖల అధికారులతో కలిసి గోష్పాదక్షేత్రంలోని ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూ ఇందులో ప్రజాప్రతినిదులు, అధికారులు, ప్రజలు సుమారు 3000 మంది హాజరయ్యే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. యోగా సాధనలో పాల్గొనేవారు తెల్ల వస్త్రాలు ధరించి రావాలన్నారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించామన్నారు. గోదావరి నదిలో మూడు బోట్లు, 10 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని మత్స్య శాఖ అధికారులను ఆదిశించామన్నారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్‌లోని రెండు మున్సిపాల్టీలు, తొమ్మిది మండలాల్లో 620 మంది నోడల్ ఆఫీసర్లు 1907 లోకేషన్లలో శనివారం యోగాంధ్ర ట్రైల్ మాక్ యోగా సాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ధ్యేయంగా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, మున్సిపల్ ఏఈ సుమంత్, ఆర్ఐ శ్యామ్, క్షేత్రంలోని దేవాలయాల నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

మాక్‌డ్రిల్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి



మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గోపాలపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శనివారం నిర్వహిచతలపెట్టిన యోగాంధ్ర మాక్‌డ్రిల్‌లో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని స్పెషల్ ఆఫీసర్ టీ. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మాక్‌డ్రిల్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో రెండుకోట్ల మందిని భాగస్వామ్యులను చేసేందుకు ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు నెలరోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా భాగస్వాములైన వారిని సంసిద్ధం చేసేందుకు మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఉదయం ఆరుగంటలకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని 173 ప్రదేశాలలో నిర్వహిస్తున్నామన్నారు. వారి పర్యవేక్షణ నిమిత్తం 18 మంది మండల స్థాయి అధికారులను నియమించామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె. అజయ్‌బాబు, ఈవోపీఆర్‌డీ బీఎస్ఎస్ శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసాలు



చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ పరిధిలోని కేంద్రాలలో 30 మంది చిన్నారులు చేరారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు,మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి హాజరై చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. దీనిలో భాగంగా యానాది కాలనీ అంగన్వాడీ కార్యకర్తలకు ఇండక్షన్ స్టవ్, కుక్కర్, వంటగిన్నెలు, పిల్లలు ఆడుకునే వస్తువులను అందజేశారు.కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, ఎంఈవోలు బి. స్వరూప్, రామకిషోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. అలాగే పెనకనమెట్ట, దొమ్మేరు, కాపవరంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు.

సందడిగా అంగన్‌వాడీ కేంద్రాలు



తాళ్లపూడిలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద చిన్నారులతో సూపర్‌వైజర్ భాగ్యకుమారి

తాళ్లపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సందడి నెలకుంది. మూడు సంవత్సరాలు దాటిన పిల్లలను ఆయా కేంద్రాల్లో చేర్చే కార్యక్రమాన్ని చేపట్టారు. తాళ్లపూడి 3వ నెంబర్ కేంద్రం వద్ద సూపర్‌వైజర్ భాగ్యకుమారి మాట్లాడుతూ మండలంలో 43 మంది వరకు మూడు సంవత్సరాలు దాటిన పిల్లలు ఉండగా, అందులో 19 మంది పిల్లలు ఆయా గ్రామాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరారని తెలిపారు.

వసతి గృహాల్లో ఫోకర్ స్ప్రేయింగ్

కొవ్వూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మలేరియా నివారణలో భాగంగా వాడపల్లి బీసీ బాలుర వసతి గృహంలో శుక్రవారం ఫోకర్ స్ప్రేయింగ్ చేసినట్టు కొవ్వూరు సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా దొమ్మేరు ఆరోగ్య కేంద్రం పరిధిలో దీన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దొమ్మేరు ఆరోగ్యకేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ వి.శ్రీనివాస్, ఎం. పాండురంగారావు, ఆశ, ఎంపీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

పోతవరం జాతరకు రావాలని ఆప్కాబ్ చైర్మన్‌కు ఆహ్వానం



గన్ని వీరాంజనేయులను కలిసి ఆహ్వానిస్తున్న టీడీపీ నాయకులు

నల్లజర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పోతవరంలో జరుగుతున్న జాతరకు రావాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులను శుక్రవారం ఆయన నివాసంలో మండల టీడీపీ నేతలు కలిసి ఆహ్వానించారు. ముందుగా ఆయన్ని శాలువాతో కప్పి సత్క రించారు. అనంతరం శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆయనకు పట్టువస్త్రాలు అందజేశారు. టీడీపీ నాయకులు ఆడిటర్ గారపాటి యశ్వంత్, కొయ్యలమూడి నాగార్జునసవలం రామకృష్ణ ఉన్నారు.

నల్లజర్ల ఏవోగా సోమశేఖర్

నల్లజర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండల వ్యవసాయాధికారిగా బి. సోమశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కమల్‌రాజ్ దేవరపల్లి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొయ్యగూడెం, జంగారెడ్డిగూడెంతో పాటు మరో ఐదు మండలాలకు హబ్ ఆపరేషన్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న సోమశేఖర్ బదిలీపై ఇక్కడకి వచ్చారు.

తాళ్లపూడి తహశీల్దార్‌గా లక్ష్మీలావణ్య

తాళ్లపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండల తహశీల్దార్‌గా ఎన్. లక్ష్మీలావణ్య శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె రాజానగరం మండలం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు సిబ్బంది సహకారంతో పరిష్కరిస్తానని చెప్పారు. ఆమెకు డీటీ భారతి, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్‌వోలు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేశారు.

రామేశ్వర యాత్రకు స్పెషల్ సర్వీసు ప్రారంభం

కొవ్వూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి షట్ షణ్ముక రామేశ్వర యాత్రకు స్పెషల్ బస్సును శుక్రవారం పంపించినట్టు డిపో మేనేజర్ వెవీవీఎస్ కుమార్ తెలిపారు. ఈ యాత్రలో శ్రీకాళహస్తి, తిరుత్తణి, కంచి, స్వామిమలై, పుజుచేరమలై, మధురై, త్రిపురకుద్రం, రామేశ్వరం, తిరుచందూర్, పళని, అరుణాచలం, కాణిపాకం, శ్రీపురం, క్షేత్రాలో దర్శనం చేయించడం జరుగుతుందన్నారు. మొత్తం ఏడురోజుల యాత్రలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో కలిపి మనిషి ఒక్కరికి రూ. ఎనిమిది వేలు టికెట్ ధరను నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే జూలై నెలలో నవ నరసింహ క్షేత్రదర్శిని యాత్రా స్పెషల్ బస్సు బయలు దేరుతుందన్నారు. ఈ యాత్రలో సింహాచలం, అంతర్వేది, మంగళగిరి, పెంచలకోన (నెల్లూరు), అహోబిలం, కదిరి, యాదగిరిగుట్ట, ధర్మపురి, వేదాద్రి (జగ్గయ్యపేట) క్షేత్రములలో దర్శనం చేయించడం జరుగుతుందన్నారు. మొత్తం ఆరు రోజుల యాత్రలో మనిషి ఒక్కరికి రూ. 5100 టికెట్ ధర నిర్ణయించామన్నారు. ఈ యాత్రలో అల్పాహారం, భోజనం, వసతి ఖర్చులను యాత్రికులే భరించాలన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు గోష్పాదక్షేత్రంలో మాస్ యోగా



సంస్కృత కళాశాల ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శనివారం ఉదయం మాస్ యోగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టీ.నాగేంద్రకుమార్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యాపీఠంలోని సంస్కృత కళాశాల ప్రాంగణంలో శుక్రవారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా శిక్షకులు పెనుమత్స సరోజిని, యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న వారికి యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు వేయించారు. కమిషనర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ శనివారం ఉదయం కొవ్వూరు పట్టణంలోని గోదావరి తీరంలోని గోష్పాదక్షేత్రంలో నిర్వహించనున్న మాస్ యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, డివిజన్ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిదులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, మున్సిపల్ ఏఈ సుమంత్, ఆర్ఐ శ్యాం, ఫణికుమార్, సచివాలయం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే దొమ్మేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి'



దుద్దుకూరులో రక్తదానం చేస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు అనిల్

దేవరపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో ఉన్న వారికి రక్తదానం చేసి ఆదుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఆంద్రూ అనిల్ పేర్కొన్నారు. దుద్దుకూరులోని ముళ్లపూడి వెంకట్రావు కల్యాణ మండపంలో శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా క్వారీ క్రషర్స్ యాజమానుల సంఘం, రాజమహేంద్రవరం సంజీవని వాలంటీర్ బ్లెడ్ సెంటర్ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంద్రూ అనిల్, కార్యదర్శి దోనెల్లి మధుబాబు మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల్లో గాయపడినవారికి రక్తం అందుబాటులో లేకపోతే యువత రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దుద్దుకూరు, గౌరీపట్నం, పంగిడి గ్రామాలకు చెందిన క్వారీలో పనిచేసే యువకులు, క్వారీ యాజమానులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయడంతో వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముళ్లపూడి దొరాజీ చౌదరి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొయ్యలమూడి తాతారావు, టీడీపీ నాయకులు రవికుమార్, ఉప్పులూరి రాంబాబు, కొఠారు ధృవకాంత్, రాజమహేంద్రవరం జేసీఐ చైర్మన్ అనంత శ్రీనివాస్‌రెడ్డి, రాజమండ్రి సంజీవని వలంటీర్ సెంటర్ మేనేజర్ ఎన్.ప్రకాశ్, టెక్నీషన్లు అనూష, మేఘన, క్వారీ యాజమానుల సంఘ నాయకులు కోట్ల కనకేశ్, సముద్రారెడ్డి, ఎం.సూర్యనారాయణ రాజు, రామకృష్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ



తాళ్లపూడి: వేగేశ్వరపురం పాఠశాలలో టీచర్లు, విద్యార్థులతో ఎంఈవో బాలామణి

తాళ్లపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఆయా పాఠశాలలు సందడిగా కనిపిస్తున్నాయ. దీనిలో భాగంగా వేగేశ్వరపురం ఉన్నత పాఠ శాలలోని విద్యార్థులకు విద్యామిత్ర కిట్లుకు సంబంధించి బట్టలు, బ్యాగులు రాకపోవ డంతో కేవలం నోటుపుస్తకాలు మాత్రమే అందించారు. ఆ కిట్లు వచ్చిన వెంటనే అందజేస్తామని ఎంఈవో బాలామణి చెప్పారు.

దేవరపల్లి: ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని మండల టీడీపీ అధ్యక్షుడు ఆంద్రూ అనిల్ పేర్కొన్నారు. దుద్దుకూరు జడ్పీహైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీర్రాజు, టీడీపీ నాయకులు ముళ్లపూడి దొరాజీ చౌదరి, కొయ్యల మూడి తాతారావు, కే.రవికుమార్, ముళ్లపూడి సత్యనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షులు కాంద్రు రామకృష్ణ, జనసేన నాయకులు సాంబశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మోర్త హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

ఉండ్రాజవరం: మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేసింది. 2025-26 విద్యాసంవత్సరానికి గాను మండలం లోని 3,043 మంది విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి మూడు జతల యూనిఫామ్, బ్యాగ్, బెల్ట్, బూట్లు, రెండుజతల సాక్స్, పాఠ్య పుస్తకములు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్, డిక్షనరీలు అందజేసినట్లు ఎమ్ఈవో శారదా జ్యోత్స్న చెప్పారు. మండలంలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఆమె వివరించారు.

ఆటోను ఢీకొన్న లారీ

● ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

● కృష్ణంపాలెం జాతీయ రహదారిపై ప్రమాదం



అంజలీ దుర్గ (ఫైల్)

దేవరపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆటోను వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారి వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివి. రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన చుక్కా బంగారయ్య, రమణమ్మ కుటుంబం విజయవాడ కనకదుర్గమ్మ దైవదర్శనానికి 11 మందితో ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగింది. ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందులో పెద్ద కుమార్తె అంజలీదుర్గ (17) తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందింది. ఈమె డిగ్రీ చదువుతోంది. మరో ఇద్దరు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆటోడ్రైవర్ ఎన్. నరేష్, నెల్లి వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది.

'బడి తరువాత విద్యాబోధన'

దేవరపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యర్నగూడెం ఎంపీపీ స్పెషల్ పాఠశాలలో బడి తరువాత విద్యాబోధన సెంటర్‌ను పార్డ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు నూతలపాటి ఆనందరావు, పార్డ్ ఇండియా గౌరవ అధ్యక్షుడు కారుమంచి గణేశ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లాడుతూ పార్డ్ ఇండియా సంస్థ ద్వారా ప్రతి ఏడాది బడి తరువాత విద్యాబోధన కార్యక్రమాన్ని ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తూ... విద్యార్థులకు, పుస్తకాలు, పెన్నులు, స్నాక్స్ అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వర్, పార్డ్ ఇండియా సంస్థ ప్రతినిధులు సోమిశెట్టి వెంకట్రావు, బేతాళ నాగమణి పాల్గొన్నారు.

అభినందన సభ



రాంబాబు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఇవ్వల రాంబాబు గత నెల 31న స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం అభినందన సభను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలువురు టీచర్లు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.రామకృష్ణ, ఏపీటీఎఫ్ నాయకుడు కోట రామప్రసాద్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వైవీ స్వామి, ఇతర ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.